
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 23 ఫిబ్రవరి 2025




డీఎంహెచ్‌వో కార్యాలయం వెనుక సర్వే నెంబరు 202లోని 20 సెంట్ల స్థలంలో ఉన్న పెద్ద గుండు

గుట్టల్లో.. గూడుపుఠాని...!

అవన్నీ పెద్ద పెద్ద గుట్టలు. బండరాళ్లు.. ముళ్ల పొదలు.. అక్కడ ఎటువంటి పంటలు సాగు చేయలేము.. చేయాలనుకున్నా.. సాధ్యం కాదు.. అటువంటి సాగుకు పనికిరాని గుట్టలను కొందరు బడాబాబులు బినామీల పేరుతో కాజేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. ఆ గుట్టలు, బండలతో నిండిన స్థలాలు ఎవరికీ ప్రభుత్వం పంపిణీ చేయలేదు. అయినా ఎటువంటి డీకేటీ పట్టాలు లేకపోయినా... కొందరి పేరుతో ఆన్‌లైన్ అయిపోయాయి. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ గుట్టలు ప్రస్తుతం కోట్లాది రూపాయల విలువ చేస్తాయి. వైసీపీ హయాంలో ఈ అక్రమాలను ఎన్నోమార్లు పత్రికలు బయటపెట్టినా... అక్రమార్కులపై ఈగ కూడా వాలలేదు. కొన్ని రోజులుగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతుండటంతో గుట్టల అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

- బినామీల పేర్లతో గుట్టలను ఆన్‌లైన్ చేసేశారు...
- ఎకరాలకు.. ఎకరాలే కాజేశారు...
- వైసీపీ హయాంలో కబ్జాదారులపై ఈగ వాలని వైనం
- ఈ ప్రభుత్వమైనా చర్యలు తీసుకునేనా?



సర్వే నెంబరు 229/3లోని పెద్దబండ (గుట్ట)



203/2లో 20 సెంట్ల విస్తీర్ణంలో గుట్ట



సర్వే నెంబరు 243లో గల 3.75 ఎకరాల గుట్ట

రాయచోటి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూములు సాగుచేసి జీవనం సాగిస్తారనే ఉద్దేశ్యంతో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం భూమి పంపిణీ చేస్తుంది. అయితే రాయచోటి పట్టణంలో కొందరికి పెద్దపెద్ద గుట్టలు, బండరాళ్ల ఉన్న భూములను పంచి పెట్టారు. ప్రభుత్వం పంచిపెట్టిందో? లేదో కానీ.. కొందరి పేరు మీద మాత్రం ఆన్‌లైన్ అయిపోయాయి. దాదాపు 12, 13 సంవత్సరాల కిందట ఆ గుట్టలు ఆన్‌లైన్ అయినా.. ఇప్పటి వరకు ఆ గుట్టల్లో కనీసం ఒక రాయి కూడా తొలగించిన పాపాన పోలేదు. ఎవరో తమ బినామీల పేరుతో ఈ గుట్టలకు దొంగ పట్టాలను పుట్టించి ఆన్‌లైన్ చేసుకున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఆ గుట్టలే.. ఇప్పుడు కోట్ల రూపాయల విలువ చేస్తున్నాయి. పట్టణంలోని మాసాపేట, కస్పా గొల్లపల్లె గ్రామాల పరిధిలో ఉన్న దాదాపు ప్రతి గుట్ట ఎవరో ఒకరి పేరుతో ఆన్‌లైన్ అయిపోవడం విశేషం.

గుట్టలని తెలిసినా..

రాయచోటి మున్సిపాలిటీలోని మాసాపేట, కస్పా గొల్లపల్లెతో పాటు రాయచోటి రూరల్ మండలంలోని దిగువ అబ్బవరం, పెమ్మాడ పల్లె, చెర్లోపల్లెకు చెందిన భూములు రాయచోటి పట్టణం రింగురోడ్డుకు దగ్గరగా ఉండడంతో.. వీటికి విలువ ఎక్కువగా ఉంటుంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారపరంగానూ.. ఈ భూములకు గిరాకీ ఎక్కువ. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమాలకు పాల్పడ్డారు. అన్ని విధాల తమ మాట వినే అధికారులను అడ్డం పెట్టుకుని అక్రమంగా గుట్టలను ఆన్‌లైన్ చేసుకున్నారు. మాసాపేట గ్రామంలో ఖాతా నెంబరు-1391లో వడ్లతల రవీంద్రారెడ్డి పేరుతో 157 సర్వే నెంబరులో 0.59 సెంట్లు, 202 సర్వే నెంబరులో 20 సెంట్లు, 203/2లో 20 సెంట్లు, 237బి2లో 1.25 ఎకరాలు, 234లో 6 4 సెంట్లు, 996లో 99 సెంట్లు, కస్పాగొల్లపల్లె గ్రామంలో ఖాతా నెంబరు-179, 25 సర్వే నెంబరులో 36 సెంట్లు ఆన్‌లైన్ చేశారు. వడ్లతల బీమారెడ్డి పేరుతో ఖాతా నెంబరు 1364లో సర్వే నెంబరు 229/3లో 3.24 ఎకరాలు, 1033 సర్వే నెంబరులో 1.22 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. అసలు వీళ్లు మాసాపేట గ్రామానికి చెందిన వాళ్లు కారు. శిబ్యాల వెంకటనారాయణ (ఖాతా నెంబరు 1013)కు సర్వే నెంబరు 1187/4లో 1.26 ఎకరాలు తన సొంత భూమి ఉంది. అయితే ఇతడి పేరు మీద సర్వే నెంబరు 154/3లో 75 సెంట్లు, 391లో 21 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేశారు. ఈ భూములన్నింటినీ 2012, 2013 సంవత్సరాలలో ఆన్‌లైన్ చేశారు.

సూత్రధారులెవరో?

విలువైన ఈ భూములను పకడ్బందీగా కాజేసిన సూత్రధారులు ఎవరో? అనే చర్చ జరుగుతోంది. స్థానికులు కాకపోయినా.. అసలు డీకేటీ పట్టా లేకపోయినా.. తమకు కావాల్సిన వాళ్ల పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నది ఎవరు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. భారీ మొత్తంలో చేతులు మారడంతో ఈ ఆక్రమాలకు అధికారులు సాయపడి ఉంటారని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే...


విలువైన భూములన్నీ కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉండడంతో ఎకరా భూమి రూ.కోట్లలోనే ధర పలుకుతోంది. ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఒక్కో ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించినా ఎంతో ఉపయోగం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అక్రమార్కులు తమ గుప్పిట్లో పెట్టుకున్న భూముల విలువ సుమారు రూ.20 కోట్లకుపైనే ఉంటుందని పలువురు చెబుతున్నారు.

కలెక్టర్ కొరడా ఝుళిపించాల్సిందే

కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లాలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించి అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కలెక్టర్ దూకుడు పెంచి ప్రభుత్వ భూములను ఆక్రమించి చేసిన నిర్మాణాలను కూలదోసి మరీ స్వాధీనం చేసుకుంటున్నారు. భూములను ఆక్రమించుకున్న ఎమ్మెల్యే స్థాయి నాయకులకే నోటీసులు పంపిస్తున్నారు. పీలేరు, రాజంపేట, రాయచోటిలలో ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. ఇదేవిధంగా కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ గుట్టల వెనుక ఉన్న గూడుపుఠానీని వెలుగులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

పాలకొండల్లో మల్లికార్జునుడు

- ఆవులు మాంసం తినే అరుదైన క్షేత్రం
- బండెన్న, అక్కదేవతలు కొలువైన ఆలయం
- బండెన్న దర్శనం ఆడవాళ్లకు నిషేధం



6

దివ్యాంగుల క్రికెట్‌లో

శివకోటి ప్రతిభ

- అంతర్జాతీయ టీ20లో కెప్టెన్‌గా రాణింపు



6

పేదవారికి మాత్రమే

ఇంటి పట్టా అందాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

6

గురుకుల విద్యార్థినులకు అవార్డుల ప్రదానం

- బెంగళూరులోని అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో...



విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డును అందజేస్తున్న విప్రో చైర్మన్, సీఈవో

6

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- మార్చి 1 నుంచి 49 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు
- 28,602 మంది విద్యార్థులు...
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవో కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఇంటర్ పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొదటి సంవత్సరం 14,855 మంది, రెండో సంవత్సరం 13,747 మంది, మొత్తంగా 28,602 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయబోతున్నారని చెప్పారు. వీరితో పాటు 2156 మంది ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి 49 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, డీఈవో సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు ప్రకాశ్, అమరేంద్రకుమార్, నాగసురేశ్, విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య, ఆర్టీసీ, తపాలా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రళయకాల రుద్రుడు.. వీరభద్రుడు...

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- రేపు కల్యాణోత్సవం
- మార్చి 2న మహానైవేద్య ఘట్టం... రథోత్సవం



రాయచోటిలోని వీరభద్రాలయం



వీరభద్రుడి మూలవిరాట్



భద్రకాళీ అమ్మవారి మూలవిరాట్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రళయకాల రుద్రుడు... కన్నడ భక్తుల ఆరాధ్యుడు.. దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. రాయచోటి పట్టణంలోని మాండవ్యనది ఒడ్డున వెలిసి ఉన్న ప్రళయకాల రుద్రుడు రాయచోటి వీరభద్రుడు మహాశివుడి జటాజూటం నుంచి ఉద్భవించి శివుడి ఆదేశానుసారం రాయచోటి సమీపంలోని మాండవ్యనది ఒడ్డున కొలువుతీరారని ఇతిహాసం ద్వారా తెలుస్తోంది. వీరభద్రాలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం జరిగే బ్రహ్మోత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల ఆధ్వర్యంలో జరగనున్నాయి. వీరభద్రాలయంలో ఈ నెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈనెల 23న తెల్లవారుజాము 5 గంటలకు యాగశాల ప్రవేశంతో మహాగణపతి పూజ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ రాత్రి 9 గంటలకు కల్యాణోత్సవం, మార్చి 2వ తేదీ తెల్లవారుజాము 4.30 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, ఉదయం 11.45 గంటలకు వైభవంగా స్వామి వారికి మహానైవేద్యం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం జరగనుంది. 5వ తేదీ ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు.

కాలువను పూడ్చేశారు...

- ప్రభుత్వ భూమిలో రియల్టర్ పాగా
- కాలువను పూడ్చి లేఔట్...
- ఆయకట్టుకు నీరు రాక రైతుల ఇబ్బందులు
- ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం



వ్యవసాయ భూమిని లేఔట్‌గా మార్చిన దృశ్యం



ఇరిగేషన్ కాలువను పూడ్చివేసి 4 అడుగుల ఎత్తులో వేసిన మట్టి

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆ కాలువ ఆయకట్టు కింద దాదాపు 40 ఎకరాలకు పైగా భూమి సాగులో ఉంది. అలాంటి కాలువను ఓ రియల్టర్ పూడ్చి వేసి తన వెంచర్‌లో కలుపుకుని దర్జాగా కబ్జా చేసేశాడు. దీంతో ఆ కాలువ కింద ఉన్న ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా మారిపోయాయి. ఇదేమని ప్రశ్నించిన తమపై ఆ రియల్టర్ దౌర్జన్యం చేస్తున్నాడని రైతులు వాపోతున్నారు. మండలంలోని కందుకూరు పంచాయతీ పరిధిలో గల వ్యాసరాయసముద్రం చెరువు ఆయకట్టు భూముల్లో కొందరు అక్రమంగా ప్లాట్లు వేసి లక్షలు గడిస్తున్నారు. కందుకూరు కస్పా లోంచి వెళ్లే కొత్తకాలువ కింద 200 ఎకరాలకుపైగా భూమి సాగులో ఉంది. కొత్తకాలువ నుంచి పిల్ల కాలువల గుండా వ్యవసాయ భూములకు సాగునీరు వెళుతుంది. గ్రామ శివారులో ఇలా సుమారు 40 ఎకరాలకు సాగునీటిని తరలించే కాలువ మొదటి భాగంలో ఇరువైపులా సర్వే నెంబరు-656లో ఉన్న వ్యవసాయ భూమిని ఇటీవల ఓ రియల్టర్ కొనుగోలు చేసి ఆ భూమి మధ్యలో నుంచి దిగువ భూములకు సాగునీటిని అందించే కాలువను పూడ్చి వేసి ప్లాట్లు వేశాడు. భూమి చుట్టూ రాతికూసాలు నాటి లేఔట్ వేశాడు. దీంతో తమ భూములకు సాగునీరు ఎలా వస్తుంది? ఇరిగేషన్ కాలువ కబ్జా చేసి పూడ్చివేసే హక్కు ఎవరిచ్చారంటూ ఆయకట్టుదారులు ప్రశ్నిస్తే మీకు చేతనైంది చేసుకోండి అని బెదిరిస్తున్నాడని వాపోతున్నారు. ఇలా అయితే తమ సాగు భూములు బీడుగా పెట్టుకోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ప్రేక్షకపాత్ర..

కందుకూరులో ఇరిగేషన్ కాలువను పూడ్చి, వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్ కాకుండా, లేఔట్ అప్రూవల్ చేయకుండా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా భూములకు నీరు రావాల్సిన కాలువను పూడ్చివేసి అర్ధంతరంగా ప్లాట్లు వేసేస్తే ఎవరికి చెప్పుకోవాలని ఆయకట్టుదారులు ఆవేదన చెందుతున్నారు. ప్లాన్ అప్రూవల్ చేయాల్సిన పంచాయతీరాజ్ అధికారులు, ల్యాండ్ కన్వర్షన్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి ఈ అక్రమ లేఔట్‌పై చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

లేఔట్ గురించి మా దృష్టికి రాలేదు

కందుకూరులో వ్యవసాయ భూమిలో వెళుతున్న ఇరిగేషన్ కాలువను పూడ్చి లేఔట్ వేసిన విషయం మాకు తెలియదు. అక్రమంగా ఎవరూ లేఔట్ వేయకూడదు. అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ఇరిగేషన్ కాలువను పూడ్చి లేఔట్ వేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.

-శ్రీరాములు నాయక్ తహశీల్దార్, పెద్దతిప్పసముద్రం

రెవెన్యూ సిబ్బంది మాయాజాలం!

- భూములకు 1బీ, అడంగల్ రావడం లేదు...
- కొందరి భూములు ఇతరుల పేర్లతో ఆన్‌లైన్ చేసేశారు...
- తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన బాధిత రైతులు
- పురుగుల మందు డబ్బా, పెట్రోలు బాటిల్‌తో ఆందోళన



తహశీల్దార్ కార్యాలయం ముందు పురుగుల మందు డబ్బా, పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న రైతులు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట రెవెన్యూ అధికారుల మాయాజాలంతో అనేక భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు సహనం కోల్పోయి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీలో రీసర్వే సందర్భంగా రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులతో మా భూములు మాకు లేకుండాపోయే ప్రమాదం ఏర్పడుతోందని, సమస్యను పరిష్కరించేవరకు కదిలేది లేదంటూ పంచాయతీ పరిధిలోని గండువారిపల్లి గ్రామానికి చెందిన రైతులు కార్యాలయ గేటుకు అడ్డంగా కూర్చుని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ భూములకు 1బీ, అడంగల్ రావడం లేదని కొందరు, మా భూమిని ఇతరుల పేర్లతో ఆన్‌లైన్ చేసేశారంటూ ఇంకొందరు, మ్యుటేషన్‌లు తిరస్కరించడంతో భూముల క్రయవిక్రయాలు సాధ్యం కావడం లేదని ధ్వజమెత్తారు. అక్రమాలకు బాధ్యుడిని చేస్తూ గుమ్మసముద్రం వీఆర్వో కోటిరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ అజారుద్దీన్ బయటకు వచ్చి ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించగా వెంట తెచ్చుకున్న పురుగుమందు, పెట్రోలు బాటిళ్లను బయటకు తీసి ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత, గందరగోళ పరిస్థితి నెలకొంది. సమస్యలపై విచారించి న్యాయం చేస్తామని, తొందరపడటం సరి కాదని తహశీల్దార్ సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు. రీసర్వేలో భాగంగా భూములకు కేటాయించిన ఎల్‌పీఎం నెంబర్లు జాయింట్‌గా ఉండటంతో చాలా మంది రైతులకు 1బీ, అడంగల్ రావడం లేదని రైతులు వాపోయారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన రెవెన్యూ ఉద్యోగి..

గుమ్మసముద్రం పంచాయతీ గండువారి పల్లె వద్ద గ్రామస్థులు జాతర సందర్భంగా జ్యోతులు మోసే స్థలం, సంక్రాంతి పండుగకు చిట్లాకుప్ప, పశువుల మేత తదితర అవసరాలకు తరతరాలుగా వినియోగిస్తున్న గయాలు భూమిని సచివాలయ సర్వేయర్‌గా పనిచేసిన రాజేంద్ర తన తల్లి పద్మావతమ్మ పేరున మార్చుకుని కబ్జా చేశాడని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదని, వెంటనే ఆ స్థలానికి విముక్తి కలిగించాలని తహశీల్దార్‌ను కోరారు. గ్రామస్థులకు సంఘీభావంగా సీపీఐ నాయకులు మనోహర్‌రెడ్డి, రఘునాథ్‌లు నిరసనలో పాల్గొన్నారు. తహశీల్దార్ హామీ మేరకు తాత్కాలికంగా విరమించామని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేసి కార్యాలయం ఎదుట ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు స్పష్టం చేశారు.



- ఆవులు మాంసం తినే అరుదైన క్షేత్రం
- బండెన్న, అక్కదేవతలు కొలువైన ఆలయం
- బండెన్న దర్శనం ఆడవాళ్లకు నిషేధం
- శివరాత్రికి మూడు రోజుల వేడుక

పాలకొండల్లో మల్లికార్జునుడు

ఆవు శాఖాహారి. పాలతల బండెన్న గుడి పరిసరాల్లో మాత్రం ఆవు మాంసాహారి. ఈ వింత చూడాలంటే.. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పంచాయతీ పరిధిలోని పాలతల మల్లేశ్వరస్వామి ఆలయం సందర్శించాలి. కడప నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే శేషాచలం సానువుల్లో భాగమైన పాలకొండల్లోని ఈ గుడికి చేరుకోవచ్చు. మహాశివరాత్రికి మూడు రోజులపాటు వైభవంగా వేడుకలు జరిగే ఆలయం ఇది. ప్రకృతి అందాల నడుమ వెలసిన ఈ ఆలయ సందర్శన గొప్ప అనుభూతిని ఇస్తుంది.

- పెండ్లిమర్రి, ఆంధ్రజ్యోతి



పశువులకు మేతగా మాంసం

వేట నరికి వండిన మాంసం మిగిలితే తీసుకువెళ్లరాదని నమ్మకం. దీంతో అక్కడే వదిలేస్తారు. ఇక్కడ తిరుగులాడే ఆవులు, ఎద్దులు ఈ మాంసాన్ని తినడం అలవాటు చేసుకున్నాయి. ఈ అలవాటే బండెన్న ఆలయ ప్రాంగణంలోని 200 పశువులను మాంసాహారులుగా మార్చేశాయి.

అక్కదేవతల సమక్షం



ఈ ప్రాంగణంలో పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం, పులి బండెన్న, పుట్ట ఆంజనేయస్వామి, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, కాశిరెడ్డి నాయనలను దర్శించుకోవచ్చు. ఈ క్షేత్రంలో అన్న బండెన్న సహా ఏడుగురు అక్కదేవతలైన పెద్దవారమల్లమ్మ, చిన్నవారమల్లమ్మ, నాగమునెమ్మ, దేవ కన్యక, సూర్యకన్యక, చంద్రకన్యక, మల్లమ్మలు ఉంటారు. మహిళలు తడిగుడ్డలతో వచ్చి అక్కదేవతలను ప్రార్థిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. బండెన్న ఆలయం వద్దకు మాత్రం మహిళలకు ప్రవేశం నిషేధం.

బండెన్న కత



బండెన్నకు మాంసాహారం సంబంధించి స్థానికంగా ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం బండె న్న అనే రాక్షసుడు ఇక్కడ ఓ బండపైన ఉండేవాడు. పెళ్లి కాలేదు. అడవి జంతువులను వేటాడి తినేవాడు. భీకరాకారుడైన బండెన్నను ప్రసన్నం చేసుకోవడానికి ఈ ప్రాంతీయులు పూజలు చేసేవారు. బండెన్నకు ఇష్టమైన మాంసాహారం నైవేద్యంగా పెట్టేవారు. వారి మొక్కులు ఫలించేవని ప్రచారం కావడంతో ఆలయం వద్ద వేటలు నరికి మాంసాహారం వండి నైవేద్యంగా పెట్టి భోజనాలు చేయడం ఆచారంగా మారింది. బ్రహ్మచారి కావడం వల్లే ఆడవాళ్లు బండె న్న సమక్షంలోకి వెళ్లరాదని చెప్పుకుంటారు. మాంసం వండడం మొదలు, వడ్డింపుల దాకా బండెన్న ముం దు పనులన్నీ మగవాళ్లే చేస్తారు.

నిత్యాన్నదానం

ఆలయం ఎదురుగా వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిత్యం అన్నదానం చేస్తుంటారు. ఒక్క శివరాత్రి రోజే లక్షలాది మంది భక్తులకు భోజనాన్ని వడ్డిస్తారు.



కృష్ణానాయక్
ఈఓ,దేవస్థానం

మహాశివరాత్రికి పాలతలలో చేపడుతున్న ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ కృష్ణానాయక్ ఆంధ్రజ్యోతికి వివరాలు తెలిపారు.

రవాణా సౌకర్యం...

పాలతల క్షేత్రానికి భక్తులు చేరుకునేందుకు ఘాట్ రోడ్డు ఉన్నందున కండీషన్‌లో ఉన్న 150 బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, రాయచోటి డిపోల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. కొండపైన టూవీలర్, ఫోర్‌వీలర్, భారీ వాహనాలు, ఆర్టీసీకి ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు.

వసతులు...

ఆలయం వద్ద ఉన్న కోనేర్లను శుభ్రం చేశారు. తాగు నీటికి ఇబ్బందులు లేకుండా 8 బోర్లు అందుబాటులో ఉన్నాయి. అంతేకా కుండా మరో 18 నీళ్ల ట్యాంకర్లు సిద్దంగా ఉంచాము. వైద్య సేవల నిమిత్తం 108, 104, ప్రైవేటు అంబులెన్స్‌లు, భక్తులు తప్పిపోతే అనౌన్స్‌మెంట్, పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేసి ఉంచాము.

భక్తుల భద్రత

అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేశాము. పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ప్రత్యేకించి కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ నిఘా పెడుతున్నాము. ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది, అదనంగా మరో 150 మంది సేవకులు ఉంటారు.

ఉత్సవాలు ఇలా...

మూడు రోజులు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాము. మొదటి రోజు బుధవారం ఉదయం 9.30 గంటలకు ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవం, రాత్రి పది గంటల నుంచి రథోత్సవం, హరికథ, చెక్కభజన, ఉచిత అన్నదానం, ప్రసాదం భక్తులకు అందిస్తాము. మద్యం విక్రయాలు జరపరాదని, ఆంక్షలు అతి క్రమిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.



చేరుకునే మార్గం...

- కడప నగరం నుంచి మూలవంక మీదుగా 25 కి.మీ. వెళ్లి కొండకు చేరుకోవచ్చు.
- పులివెందుల మీదుగా వచ్చే వారు వెల్లటూరు నుంచి తిప్పి రెడ్డిపల్లె మీదుగా చేరుకోవచ్చు.



అక్కదేవతల ఆలయం వద్ద ఉన్న కోనేరు

వివాదాస్పద భూమిలో ప్రహరీ కూల్చివేత



ఫెన్సింగ్‌ను కూల్చేస్తున్న బాధితులు

కురబలకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీప మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న వివాదాస్పద భూమిలో సిమెంట్ పలకలతో నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. సర్వేనెంబర్ 220లో 69.42 ఎకరాల భూమిలో 7.66ఎకరాల భూమిపై కొన్నేళ్లగా వివాదం నడుస్తోంది. ఈ భూమిలో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆ భూమిపైకి ఎవరూ వెళ్లకుండా 145సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో కొందరు పులివెందుల వాసులు భూమిని ఆక్రమించు కోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో స్థానిక నేతలు వారికి సహకరించడంతో వివాదం నెలకొంది. దీంతో అప్పట్లో వైసీపీ నేతలు జోక్యం చేసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి డబ్బు వసూలు చేసి సెటిల్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. తిరుపతి, అనంతపురానికి చెందిన పలువురు భూమిని ఆక్రమించారు. మొదట్లో హక్కుదారులు అడ్డుకున్నా తాజాగా ఈ భూమి తమకు చెందుతుందని స్థానికుల అండతో అనంతపురానికి చెందిన కొందరు భూమిలోకి జొరబడి కూసాలు నాటి వెళ్లిపోయారు. రెండు నెలల అనంతరం దాదాపు 100మందితో ఆ భూమిలో సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మించి వెళ్లిపోయారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు శనివారం పెద్దసంఖ్యలో చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం ప్రహరీని కూల్చి తమకు న్యాయం చేయాలని కోరారు.

గురుకుల విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డు



కలికిరి విద్యార్థినుల ప్రదర్శనను అభినందిస్తున్న విప్రో ప్రతినిధులు

కలికిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డును శనివారం అందజేశారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ(బెంగళూరు)లో రెండు రోజులు జరిగిన అవార్డు ప్రదానోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం విజేత విద్యార్థినులకు రూ.50 వేల నగదు, అవార్డును అందజేశారు. విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈఓ అనురాగ్ బెహర్ విద్యార్థినులకు అవార్డులు అందజేశారు. వివిధ విభాగాల అంశాలను విప్రో, అజీమ్ ఫౌండేషన్ ప్రతినిధులకు కోఆర్డినేటర్ అప్సానా వివరించారు. ఉత్తమ ప్రదర్శనకు కలికిరి విద్యార్థినులకు వేర్వేరుగా వివిధ రకాల బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సీపీ రామస్వామి ఎన్విరాన్‌మెంటల్ ఎడుకేషన్ సెంటర్ (సీపీఆర్‌ఈఈసీ) ఉమ్మడి ఏపీ కోఆర్డినేటర్ వెంకటరత్నం, విద్యార్థినుల కోఆర్డినేటర్, కలికిరి జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అప్సానా, విద్యార్థినులు కె.ఖ్యాతి, జె.రూపిక, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

రూ.2లక్షల 40వేలు విలువైన గంజాయి స్వాధీనం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీకేపల్లె, మంజునాథ కాలనీకి చెందిన ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపిన డీఎస్పీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారం చేస్తున్న బీకేపల్లె మంజునాథ కాలనీ వాసి గంటా భాగ్యమ్మ, గంజాయి విక్రయిస్తున్న లక్ష్మీనగర్ వాసి ఆవుల శివమ్మ ఇళ్లలో సోదాలు నిర్వహించి వారి నుంచి రూ. 2లక్షల40 వేలు విలువైన 20 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను టూటౌన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ రహీ ముల్లా, సిబ్బందితో, క్రైం ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, క్రైం ఎస్ఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి న్యూ బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. భాగ్యమ్మపై పుంగనూరు, పలమనేరు, పీటీఎం పోలీస్‌స్టేషన్లలో మూడు గంజాయి కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. మదనపల్లె వన్ టౌన్, రూరల్ సీఐలు ఎరిసావలి, సత్యనారాయణ, క్రైమ్ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదవారికే ఇంటి పట్టా అందాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేదలకే ఇంటి పట్టా అందాలని, అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వీఆర్‌ఓలకు ఇళ్ల పట్టాలు, రీవెరిఫికేషన్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇంటి స్థలం పట్టా అందాలని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ద్వారా అనర్హులను గుర్తించి వారికి ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దు చేయాలని ఆదేశించారు. కొందరు లబ్ధిదారులు అనర్హులైనా ఇంటి స్థలం పట్టా పొందాలని, వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. 2019 అక్టోబరు 15 నాటికి అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో కుటుంబం నివసించేందుకు అనువైన నిర్మాణాన్ని చేపట్టి ఉంటే నిర్మాణానికి సంబంధించిన ఆధారాలను నిర్మాణం చేపట్టిన వారి దగ్గర నుంచి తీసుకుని పరిశీలించిన అనంతరం క్రమబద్ధీకరణ చేయాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేయాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తను కోరారు. మంగళగిరిలోని కార్యాలయంలో శనివారం వారు డీజీపీని కలిశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ నిమిత్తం గతంలో ప్రత్యేక అధికారి ఉండేవారని, తద్వారా కేసుల విచారణ వేగంగా జరిగేదన్నారు. జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు.

ప్రతి విద్యార్థి కలలను సాకారం చేసుకోండి

టెక్నోకల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25లో సినీనటి నేహాశెట్టి



సినీనటి నేహాశెట్టికి జ్ఞాపికను అందిస్తున్న మిట్స్ యాజమాన్యం

కురబలకోట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తమ కలలను సాకారం చేసు కోవాలని సినీనటి నేహాశెట్టి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25లో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ళ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.

బాలిక అదృశ్యం

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జయనగర్‌కాలనీలో జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూలులో టెన్త్ చదువుతున్న బోయ రాజేశ్వరి అనే బాలిక అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. అశోక్‌నగర్ వాసి బోయహనుమంతు కుమార్తె రాజేశ్వరి శనివారం స్కూలుకు పోతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం తెలిస్తే సీఐ 9121100520, ఎస్ఐ 9121100521కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉంది

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సాహిత్యాల్లో ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రత్యేకించి కడప ఉర్దూ సాహితీ చరిత్ర ఘనమైందని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. శనివారం యోగివేమన యూనివర్సిటీ ఉర్దూ విభాగ అధిపతి ఆచార్య కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో 'కడపలో ఉర్దూ సాహిత్యం' అంశంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ఉర్దూ సాహిత్యంలో కడప సాహిత్యానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు.

ఏప్రిల్ 4 వరకు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లవద్దు

జేసీని కలిసిన ఆకేపాటి లాయర్లు ● తహసీల్దార్‌కు జేసీ ఆదేశం

రాయచోటి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్ జోలికి ఏప్రిల్ 4 వరకు వెళ్లవద్దని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రాజంపేట తహసీల్దార్ పీర్‌మున్నీని ఆదేశించారు. రాజంపేట మండలం మందపల్లె రెవెన్యూ విలేజ్ పరిధిలోని పలు సర్వేనంబర్లలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూములను ఆమరనాథరెడ్డి, అతడి కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని ఎస్టేట్ నిర్మించుకున్నారని.. రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి నాలుగు నెలల కిందట ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతో కలెక్టర్ స్థానిక సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయించారు. ఈ విచారణలో ప్రభుత్వ భూములు ఆకేపాటి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్నట్లు తేలింది. దీంతో శనివారం తన ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అమరనాథరెడ్డి తదితరులకు నోటీసులు ఇచ్చారు. అయితే శనివారం జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు అమరనాథరెడ్డి హాజరు కాలేదు. ఆయన తరఫున న్యాయవాదులు హాజరయ్యారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ నోటీసులపైన కోర్టును ఆశ్రయించామని, తమ పిటిషన్ ఏప్రిల్ 4న విచారణకు వస్తుందని, అప్పటి వరకు రాజంపేట రెవెన్యూ అధికారులు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లకుండా చూడాలని కోరారు. దీంతో ఏప్రిల్ 4 వరకు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లవద్దని జాయింట్ కలెక్టర్ రాజంపేట తహశీల్దార్‌ను ఆదేశించినట్లు సమాచారం

పురపాలికలో ప్రొటోకాల్ రగడ

● బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు



చైర్‌పర్సన్ మనూజను ప్రశ్నిస్తున్న వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలో ఎక్కడా ప్రొటోకాల్ పాటించడం లేదని వైసీపీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమైనా, ప్రతినెలా పింఛన్ పంపిణీ అయినా ఇదే పరిస్థితి ఉందని వారు వాపోయారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై తీవ్ర దుమారం రేగింది. వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్ కె.ప్రసాద్‌బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ పోడియం ముందు వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్ ఆజాం, కౌన్సిలర్లు బైఠాయించారు. అటు చైర్‌పర్సన్ మనూజ, ఇటు కమిషనర్ కె.ప్రమీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన తమను కనీసం తమ వార్డులో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానిస్తున్నారని మండిపడ్డారు. తాము ఎక్కడికి వెళ్లినా పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. కౌన్సిల్ సమావేశానికి కూడా వారినే పిలిపించుకుని సమావేశం నిర్వహించాలని, అజెండా ఆమోదం(సీఆర్)కూడా వారి నుంచే చేయించుకోవాలని ధ్వజమెత్తారు. ఎక్కడా కూడా కౌన్సిలర్లకు గౌరవం తగ్గకుండా, ప్రొటోకాల్‌ను అమలు చేస్తామన్న హామీతో ఆందోళన విరమించారు.

ఆర్థిక పరిపుష్టితో జిల్లా ముందుకు

కేంద్ర ఆర్థిక సేవా రంగ డీడీజేఎం జయశ్రీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, అన్ని ప్రమాణికాల్లో జిల్లా ముందంజలో కొనసాగడం అభినందనీయని కేంద్ర ఆర్థిక సేవా రంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఏం.జీ.జయశ్రీ అన్నారు. శనివారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన ఆకాంక్షిత జిల్లాలో 'ఆర్థిక పరిపుష్టికి పర్ఫార్మెన్స్ ఇండికేటర్' అంశంపై బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఆమెతో పాటు కెనెరా బ్యాంక్ డీజీఎం ఆర్తిఅగర్వాల్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. డీడీజేఎం మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా 'ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి' అంశాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచనందుకు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అత్యుత్తమ పురస్కారం బహూకరించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారం వరించగా అందులో వైఎస్సార్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించగ్గ విషయమన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్థనం, నాబార్డు ఏజీఎం విజయవిహారి, డీడీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై ఇరువర్గాల ఘర్షణ

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భూ వివాదంపై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. చియ్యవరం పంచాయతీ పరిధి మొలకలపోడు హరిజనవాడ వాసులు ఇంద్రమ్మ, గుండాల పెంచలయ్య మరో ఇద్దరు ప్రభుత్వ భూమిలో పనులు చేస్తుండగా గుండాల రవి కుమార్‌కు చెందిన మరో వర్గం అడ్డుపడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ వద్ద భూమి పత్రాలు ఉన్నాయని వాదోపవాదాలు పడి ఘర్షణకు పాల్పడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.

దివ్యాంగుల క్రికెట్‌లో రాణించిన శివకోటి



నందలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల క్రికెట్‌లో భాగంగా నేపాల్‌తో జరిగిన టీమ్ 20 క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు తరఫున పాల్గొన్న నందలూరు వాసి ఏల్చూరు శివకోటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. శివకోటి మాట్లాడుతూ నేపాల్‌జట్టును భారత జట్టు క్లీన్‌స్వీప్ చేసిందన్నారు. తాను భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మూడు టీ20 మ్యాచ్‌ల్లో 72 పరుగులు చేసి 11 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా ఎంపికయ్యాయన్నారు. ఫిబ్రవరి 14 నుంచి 20వ తేదీ వరకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగిన క్రికెట్ చివరి మ్యాచ్‌లో కెప్టెన్ అవకాశాన్ని అంది పుచ్చుకుని అద్భుతమైన ఆటతో భారత జట్టును విజయ తీరాలకు చేర్చానన్నారు. క్రీడా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె వాసి సింగయ్యగారి లక్ష్మీ కనపడలేదని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం నుంచి ఇంటినుంచి వెళ్లిన ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు ఎస్ఐకి 9121100580 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

25, 26న పులివెందులకు జగన్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైసీపీ నేత వైఎస్ జగన్ 25, 26 తేదీల్లో పులివెందులలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో భాకరాపురంలోని హెలీప్యాడ్‌ను శనివారం అర్బన్ సీఐ నరసింహులు పరిశీలించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ 26న ఉదయం పులివెందులకు చేరుకుని ఆయన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. 26న రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో కొత్తగా నిర్మించిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. దీంతో పులివెందులలో రెండు రోజుల పర్యటన ముగియనుంది. మాజీ సీఎంపర్యటన సందర్భంగా బందోబస్తులో భాగంగా అర్బన్ సీఐ నరసింహులు పరిశీలించారు.

సిద్దేశ్వర ఆలయ భూములు కాపాడండి

● త్రిసభ్య కమిటీకి కలమల్ల గ్రామస్థుల వినతి




ఆలయ భూములపై కలమల్లవాసులతో చర్చిస్తున్న ఆర్డీవో

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కలమల్లలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయ 63 ఎకరాల మాన్యం భూముల విషయంలో న్యాయం చేయాలని కలమల్లవాసులు శనివారం త్రిసభ్య కమిటీకి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సాయిశ్రీ, మల్లికార్జునప్రసాద్, తహసీల్దార్ శోభన్‌బాబు, జిల్లా సర్వేయర్ శనివారం కలమల్లలోని ఆలయాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. టెంపుల్ సర్వేనెంబర్లు, మొత్తం భూముల వివరాలను సేకరించారు. అలాగే శాసనాలను తిలికించి వాటి వివరాలు తీసుకున్నారు. గ్రామస్తులు అధికారులకు పూర్తి వివరాలు అందజేశారు. వీటిపై సమగ్రంగా విచారించి ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని అధికారులు వెల్లడించారు. ఇటీవలే గ్రామస్తులు ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు క్రిష్టయ్య, పుల్లారెడ్డి, కమిటీకి చెందిన శంకరయ్య, గిరి, సాంబశివారెడ్డి, రామాంజనేయులు, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

గోపవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపవరం గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.లక్ష నగదు తీసుకువెళ్లారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం గ్రామస్తులు ఆలయంలో పరిశీలించి విషయం తెలుసుకున్నారు. హుండీని ఆలయం వెనుక తీసుకెళ్లి పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



పది పరీక్షలు..
ఇక 22 రోజులే

● విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు
● మెలకువలు పాటిస్తే.. విజయం మీదే
● విద్యార్థులకు నిపుణుల సూచనలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు ఇక 22 రోజులే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా డిసెంబరు 1 నుంచి వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌ను ఉన్నతాధికారులు అమలు చేశారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. 2025 మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 27,833 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణుల య్యేందుకు వీలుగా సబ్జెక్టు నిపుణుల ద్వారా అభ్యాసన మెలకువలు తెలియజేశారు.

గణితంలో ఆరు అంశాలు చదవండి

\- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు



గణితంలో కనీస స్థాయి ఉన్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పొందాలంటే వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జత, పాఠ్యాంశాలలో ముఖ్యమైన సమస్యలను నేర్చుకోవాలి. రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జతలోని గ్రాఫ్ 8 మార్కులకు ఖచ్చితంగా వస్తుంది. నిరూపక జామితి పాఠ్యాంశం నుంచి సెక్షన్ ఫార్ములాకు చెందిన సమస్యలు నాలుగు లేదా ఎనిమిది మార్కులకు వచ్చే అవకాశం ఉంది. సాంఖ్యక శాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌పై తప్పక 8 మార్కుల ప్రశ్న ఉంటుంది. ఈ సూచనలను పాటించి ప్రాక్టీస్ చేస్తే ప్రతి విద్యార్థి గణితంలో సులభంగా ఉత్తీర్ణత పొందుతారు.

సాంఘిక శాస్త్రంలో శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు

\- షేక్ మహబూబ్‌షరీఫ్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉంది. సాంఘిక శాస్త్రంలో విద్యార్థులు సరైన శ్రద్ధ వహిస్తే మంచిమార్కులు సాధించడం పెద్ద కష్టం కాదు. ఇందులో కొన్ని సూచనలు పాటించడం అవసరం. ఎస్‌సీఈఆర్‌టీ వారు ఏ పాఠంలో ఎన్ని మార్కులకు ప్రశ్న వస్తుందో క్లియర్‌గా అందజేసిన బ్లూప్రింట్‌ను విద్యార్థులు అనుసరించాలి. అదేవిధంగా వారు అందజేసిన మూడు మోడల్ పేపర్లను క్షుణ్ణంగా నేర్చుకోవాలి. భారతదేశం, ప్రపంచపటంలోని అంశాల పట్ల బాగా శ్రద్ధ పెట్టాలి. పరీక్ష సమయంలో జవాబు రాయడంతో పాటు ముఖ్యమైన విషయాలను అండర్ లైన్, హైలెట్ చేయడం ద్వారా మంచి మార్కులను పొందవచ్చు.

తెలుగులో దోషాలు రాకుండా చూడాలి

\- డి.చెంగల్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు



తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 20 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్యభాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంకాలు, చంధస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలొస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతో పాటు రామాయణం ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఇంగ్లీష్‌లో ప్యాసేజ్ అంశాలపై పట్టుండాలి

\- టి.జాన్ సుందర్‌రాజు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు



ఇంగ్లీష్‌లో ఎడిటింగ్, ప్యాసేజ్ అంశాలపై ప్రధానంగా పట్టు సాధించాలి. యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్ వంటి అంశాలను చదవాలి. ఒకాబులరీ, గ్రామర్, టెక్స్ టూల్‌ను ఎక్కువగా సాధన చేయాలి. రెయిమ్స్, స్కీమ్, పొనెటిక్స్‌ను చదివితే సులువుగా రాయవచ్చు.

ఇంటిపన్నుల బకాయిలపై
మున్సిపల్ అధికారుల చర్యలు

● ఒక్కరోజే రూ.32.27 లక్షల మొండి బకాయి వసూళ్లు



పన్ను బకాయి వున్న దుకాణాన్ని సీజ్ చేస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల బకాయిలపై మున్సిపల్ అధికారులు చర్యలకు దిగారు. శనివారం పట్టణంలో గాంధీరోడ్డులో గల ఒక మొండిపన్ను బకాయిదారుడి బట్టల దుకాణాన్ని కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.19 కోట్లు బకాయిలున్నాయన్నారు. ముఖ్యంగా టాప్ 100లో వున్న లక్షల మొండిబకాయిదారుల దుకాణాలు, ఇళ్లకు తాళాలు వేస్తున్నామన్నారు. ప్రతి రోజు రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి టార్గెట్ పెట్టామని తెలిపారు. మార్చి 15 నాటికి 80 శాతం వసూళ్లు పూర్తి చేసేందుకు ప్రతిరోజు సచివాలయాల సిబ్బందితో సహా కార్యాలయం సిబ్బందిని కలెక్షన్‌కు వినియోగిస్తామన్నారు. శనివారం ఒక్కరోజే రూ.32.27 లక్షలు వసూలు చేశామని, పన్నులు వస్తేనే ఉద్యోగులందరికి జీతాలు లేకుంటే జీతాలుండవని హెచ్చరించామన్నారు. ఈ పన్ను వసూళ్లలో ఆర్ఐ శివచరణ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం

చక్రాయపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరు పట్టణం మలిశెట్టి కొండన్నవారి ధర్మపత్ని కీ.శే.రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం రూ.50116 విరాళంగా ఇచ్చారు. వీరికి దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆలయమర్యాదలతో ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్‌లు ఘనంగా పూజలు నిర్వహించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సెలవు ఇవ్వలేదని.. చేయి కోసుకున్న ఏఎన్‌ఎం



కన్నీటిపర్యంతమవుతున్న సింధు

చాపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయం వద్ద సింధు అనే ఏఎన్‌ఎం శనివారం సాయంత్రం గాజుతో తన ఎడమచెయ్యి కోసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈమె ఇక్కడ రెండేళ్లుగా పనిచేస్తోంది. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ గ్రామం ఉంది. అక్కడ జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న కావ్యమాధురిని సెలవు ఇవ్వాలని కోరగా ఆమె ఇవ్వలేదని సిబ్బంది తెలిపారు. డిగ్రీ దూర విద్యకు సంబంధించి ఈ నెల 24 నుంచి పరీక్షలు రాసేందుకు సెలవులు కావాలని సింధు డాక్టర్‌ను కోరగా.. సెలవు ఇవ్వలేదు. దీంతో చెయ్యి కోసుకున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయమై చాపాడులోని పీహెచ్‌సీ సీనియర్ డాక్టర్ రాజేష్‌కుమార్‌ను వివరణ అడుగగా.. సింధు చెయ్యి కోసుకున్న విషయం వాస్తవమేనన్నారు. ఆమె ఇటీవల 15 రోజులు సెలవులు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం ఈ విషయమై పూర్తి విచారణ చేస్తామన్నారు.

అభివృద్ధికి పరిశుభ్రతే మూలం: డీపీవో



చెన్నూరు మైనార్టీ కాలనీలో వీధులు శుభ్రం చేస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి పరిశుభ్రతే మూలమని, ప్రజలు తమ గ్రామంతో పాటు వారి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు మండలంలోని చెన్నూరు, రామనపల్లె, కొండపేట గ్రామాల్లో ఈవోఆర్డీ సురేశ్‌బాబుతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల ముందు ఉన్న చెత్తచెదారాన్ని నిత్యం తొలగించుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగినప్పుడే వారి కుటుంబసభ్యులు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడుపుతారన్నారు. ఈ సందర్భంగా డీపీవో గ్రామాల్లో ఈవోఆర్డీతో కలిసి చీపురు చేతబట్టి చెత్తచెదారాన్ని తొలగించిశ్రం చేశారు. అలాగే ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త ఎలా సేకరిస్తున్నారు. ఇల్ల వద్దకు వచ్చిన వారికి ఎలా ఇంటిలోని తడి పొడి చెత్త వేస్తున్నారని ప్రశ్నించి ఏది ఎలా అందివ్వాలో చెప్పడం జరిగింది. అంతేగాక ఈ మూడుపంచాయతీలోని వర్మీకంపోస్టు కేంద్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గురువేశ్వర్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, హరిత రాయబారలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కలమల్ల ఎస్‌ఐపై చర్యలు తీసుకోండి

● పోలీసుస్టేషన్ వద్ద బాధితుడు బైఠాయింపు



కలమల్ల పోలీసుస్టేషన్ ముందు బైఠాయించిన గోర్ల ఓబులేసు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కలమల్ల ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన గోర్ల చిన్న ఓబులేసు శనివారం పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ 14.12. 2024న కలమల్లకు చెందిన పొన్న శివతో ప్రాణహాని వుందని ఎస్పీకి ఫిర్యాదు చేశానని, అది సీఐ ద్వారా కలమల్ల ఎస్‌ఐకి రెఫర్ చేశారన్నారు. అలాగే 27.01.2025న తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించి వేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. ఈ రెండు ఫిర్యాదుల విషయంపై బుధవారం ఎస్‌ఐ తిమోతిని కలిసి తన ఫిర్యాదులకు న్యాయం చేయాలని అడగ్గా తనను దూషించినట్లు ఆరోపించారు. అంతేకాకుండా కలమల్ల చుట్టూ ఆటవిక రాజ్యం కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించారు.

చర్యలు తీసుకుంటాం: సీఐ రఫి

స్టేషన్ ఎదుట బైఠాయించిన గోర్ల చిన్నఓబులేసు విషయంపై కొండాపురం సీఐ రఫీ మాట్లాడుతూ పొన్నా శివపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు అనుమతి కోసం ఎదురు చూస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చేస్తామన్నారు. అలాగే ఓబులేసు ఫిర్యాదు చేసిన ఇతర విషయాలపై కూడా పరిశీలిస్తామని తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన వుండాలి

● సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

కడపరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన వుండాలని, తద్వారా ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి తెలిపారు. శనివారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో లీగల్ సర్వీసెస్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు చట్టాల గురించి తెలియజేశారు.

5333 గృహాల్లో ఇంటింటా న్యాయప్రచారం

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారం 5333 గృహాలలో ఇంటింటా న్యాయప్రచారం నిర్వహించి 57 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించామన్నారు. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు, నివారణ కొరకు ఇంటింటి న్యాయప్రచారం చేపడుతున్నామన్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 46 టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టీంలో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారాలీగల్ వలంటీర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ వర్కర్, వైద్యాధికారి, భవిత సెంటర్ నిర్వాహకులు తదితరులు ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రత్యేక పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీడబ్ల్యుఎస్ స్కీంల పనితీరు మెరుగుపడాలి : సీఈవో

కడప రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సీపీడబ్ల్యుఎస్ స్కీంల పనితీరును మరింతగా మెరుగు పరిచి ప్రజలకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం కమలాపురం నియోజక వర్గంలోని కమలాపురం, పెండ్లిమర్రి, వల్లూరు ప్రాంతాలలోని సీపీడబ్ల్యుఎస్ స్కీంలను పరిశీలించారు. సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణ, పనితీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణకు ప్రభుత్వం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ఇవి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సీపీడబ్ల్యుఎస్ స్కీం పరిధిలోని ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా కావాలన్నారు. ఇందులో అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

కమలాపురం రూరల్: ప్రజలకు నీటి కష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పాపాఘ్నినది సమీపంలో ఉన్న తాగునీటి సరఫరా పంపుసెట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్నది వేసవి కాలం అని, నీటికష్టాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఎంపీడీఓ జ్యోతి, మున్సిపల్ కమిషనరు జగన్నాథం కాంట్రాక్టర్ పి.యల్లారెడ్డి పంపు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

● జిల్లా అధ్యక్షుడిగా బి.క్రిష్ణకుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఏఈఎస్ వినోద్ నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా బి.క్రిష్ణకుమార్, కడప ఎక్సైజ్ సీఐ అసోసియేషన్ అధ్యక్షుడిగా శశిధర్, ఉపాధ్యక్షుడిగా యల్లయ్య, కార్యదర్శిగా సురేశ్‌కుమార్, ఆర్గనైజరు సెక్రటరీగా విన్నీలత, జాయింటు సెక్రటరీగా హుసేన్‌బాషా, ట్రెజరర్‌గా రాంప్రసాద్, వీసీ మెంబర్లుగా సీతారామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, విశ్వనాథరెడ్డి, హిమబిందు, సుధాకర్, కళ్యాణ్‌కుమార్‌లను ఎన్నికయ్యారు.

పెట్రోలు బంకులపై విజిలెన్స్ తనిఖీ

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప, ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల్లోని పెట్రోలు బంకులపై శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెట్రోలు, డీజల్ అమ్మకాలు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెట్రోలు క్వాలిటీపై పరీక్ష నిర్వహించారు. పెట్రోలు, డీజల్ విక్రయాల్లో అవకతవకలు జరిగినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు నాయకుల నారాయణ, శివన్న, డీఈఈ జవహర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● బంగారం స్వాధీనం.. వాహనాలు సీజ్

రాప్తాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన మహమ్మద్ రఫిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీహర్ష శనివారం తెలిపారు. కడప జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ.. మొత్తం 8 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడని సీఐ తెలిపారు. నాలుగు జిల్లాలో చోరీ చేసిన సుమారు 47 తులాల బంగారాన్ని బెంగళూరులోని అట్టికా గోల్డ్ కంపెనీలో విక్రయించాడు. వచ్చిన డబ్బుతో కారు, బుల్లెట్, స్కూటీ కొనుగోలు చేశాడు. వాటిని సీజ్ చేశామని సీఐ తెలిపారు. బెంగళూరులో గోల్డ్ కంపెనీకి అమ్మిన మొత్తం బంగారాన్ని రికవరీ చేసేందుకు ఆ కంపెనీకి నోటీసులు జారీ చేశామన్నారు. నిందితుడిపై కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పోలీస్ స్టేషన్లలో పాత చోరీ కేసులు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు.

సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

సంబేపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ప్రాపర్టీపై ఎస్ఐ భక్తవత్సలంను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై పురోగతి సాధించాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు, సలహాలు అందించారు.

శివరాత్రి ఉత్సవ కమిటీల నియామకం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్యరాల త్రేతేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా చవన శివను ఎంపిక చేస్తూ దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా కె.నరసింహులు, మా రయ్య, శ్రీలత, పద్మనాభశాస్త్రి, వినోద్ కుమార్, రమణమ్మ, రమాదేవి, రేణుకను నియమించారు. శివరాత్రి సందర్భంగా సుమారు 11 రోజుల పాటు హత్య రాలలో పెద్దఎత్తున ఉత్సవాలు జరగనున్నాయి.

నిత్యపూజ ఆలయ సేవా కమిటీ ..

సిద్దవటం: మండలంలోని నిత్యపూజేశ్వరాలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా గంగాదేవి, చెన్నమ్మ, రమణయ్య, బాలసుబ్రమ ణ్యం, లక్షుమ్మ, నరసింహారెడ్డి, పుల్లమ్మ, ఇరకయ్య, మునీంద్రను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు/ రామాపురం/ లక్కిరెడ్డిపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెనగలూరు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె ఆదర్శ పాఠ శాలల ప్రిన్సిపాళ్లు వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తర గతి పూర్తి చేసిన, 9 నుంచి 11 ఏళ్లలోపు వయసున్న విద్యార్థులు ఈనెల 25 నుంచి మార్చి 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారం కాపీని సంబంధిత పాఠశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ప్రిన్సి పాల్, ఎంఈవో, డీఈవోలను సంప్రదించా లన్నారు.

గురుకుల పాఠశాలలో..

రామాపురం: మండలంలోని డాక్టర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి చెందిన నాలుగు, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మార్చి 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కు 8897983930, 9347783214 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇన్‌చార్జి ఏఈఓగా శ్రీనివాసులరెడ్డి

రామాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి ఏఈఈగా శ్రీని వాసుల రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం రాయచోటి రూరల్ మండలంలో ఏఈఓగా పనిచేస్తున్నారు.

ముక్కు మూసుకుంటే...

చదువు సాగేదెలా?

- దుర్గంధ భరితంగా పాఠశాల పరిసరాలు
- చికెన్ సెంటర్లు, కూరగాయల దుకాణాల వ్యర్థాలన్నీ అక్కడే..





జడ్పీ బాలికల పాఠశాల ముందు పడేసిన చికెన్ సెంటర్ల వ్యర్థాలు (ఇన్‌సర్ట్)పాఠశాల వెనుక భాగంలోని చెత్త కుప్పలు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ముక్కు మూసుకుంటే చదువు సాగేదెలా? అని స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోని వ్యర్థాలన్నీ స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పక్కనే పడేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. ఈ పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ పాఠ శాల వెనుక భాగాన్ని స్థానికులు బహిర్భూ మిగా వినియోగించుకుంటుండ గా, చికెన్ సెంటర్లు, కూరగాయలు ఇతర దుకాణాల నిర్వాహకులు వ్య ర్థాలన్నీ అక్కడే పడేస్తున్నారు. ఇవ న్నీ కుళ్లిపోయి భరించలేని దుర్గంధం వెలువడుతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ విషయం పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రం వారు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లేసి వెళ్తారని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

ఇప్పటికైనా అధికా రులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు , ఆ మేరకు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

> **వారానికి రెండు సార్లు శుభ్రం చేస్తున్నాం**
>
> వారానికి రెండు సార్లు శుభ్రం చేయిస్తున్నాం. పారిశుధ్య కార్మికులను కాపలా కూడా పెట్టాం. చికెన్ సెంటర్ల వ్యర్థాలు వేయకుండా కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం..
>
> - సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ

'స్కౌట్'తో విద్యార్థుల్లో క్రమశిక్షణ

- డీఈవో సుబ్రమణ్యం



బాడెన్-పావెల్‌కు నివాళులు అర్పిస్తున్న డీఈవో, హెచ్ఎం, విద్యార్థులు

సంబేపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. స్కౌట్ ఉద్యమ పితామహుడు బాడెన్-పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని సంబేపల్లె హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వరల్డ్ థింకింగ్ డే (ప్రపంచ ఆలోచనా దినోత్సవం) వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కౌట్ అధికారులతో కలిసి బాడెన్- పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏ దేశంలోని ప్రజలు మంచి ఆలోచన లతో మెలుగుతారో ఆ దేశ భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు. మన ప్రపంచం- మన భవిష్యత్తు అనే నినాదంతో 2025 వరల్డ్ థింకింగ్ డే ని జరుపుకుంటున్నామన్నారు. స్కౌటింగ్ ద్వారా శారీరక, మానసిక, సామాజిక పరిణామం సాధించవచ్చునని, ప్రతి విద్యార్థి స్కౌటింగ్‌లో పాల్గొని సమాజానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, స్కౌట్ మాస్టర్లు మార్ల ఓబుల్‌రెడ్డి, మురళీనాయక్, షామీర్‌బాషా, గైడ్ కెప్టెన్ రాచూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు ముందు ప్రతి రైతుకు నోటీసులు ఇవ్వాలి

- ఆర్డీవో శ్రీనివాసులు



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేకు ముందు ప్రతి రైతుకు నోటీసులు ఇవ్వాలని ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం మండలంలోని దిన్నెపాడు పంచాయతీలో రీసర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని రైతుల రికార్డులు, సర్వే నెంబరు పరిశీలించి, వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. సీపీ నెంబరు ఇచ్చేముందు రైతుకు తప్పకుండా తెలియజేయా లన్నారు. గతంలో సర్వేలో తప్పొప్పులను పరిశీలించి సరిదిద్దాలన్నారు. మండల వ్యాప్తంగా 2,525 హెక్టార్లల్లోని సర్వే నెంబర్లను పరిశీలించాలన్నారు .రీసర్వే పనులు వేగవంతం చేయాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో డీటీ లు రెడ్డెన్న, హరిప్రసాదు, మండల సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి, గ్రామ సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు

వీధిలైట్లు వెలిగించాలి

పెనగలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలం ముద్రపల్లె పంచాయతి పరిధిలోని రాజుపాలెం గ్రామంలో గత 20 రోజులుగా వీధిలైట్లు వెలగడంలేదని శనివారం తహసీల్దారుకు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకుడు కె.తిరుపాల్ నాయుడు, బి.రంగనాథ్, కె.రవి, కె.నరసింహులు, కె.మల్లికార్జున నాయుడు తెలిపారు. వీధి లైట్లు వెలగని విషయం గ్రామ సర్పంచు దృష్టికి తీసుకెళ్లగా, తనకు సంబంధం లేదని, అది ఎవరు చూడాలో అధికారులను అడిగి తెలుసుకోవాలని చెప్పారన్నారు.ఇప్పటివరకు వీధిలైట్ల నిర్వహణ, చెల్లించిన బిల్లుల వివరాలను బహిర్గతం చేయాలని తహసీల్దారును కోరినట్లు ఈ సందర్భంగా వారు వివరించారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును పునరుద్దరించాలని కోరుతూ ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్రలు పిలుపునిచ్చారు. శనివారం వారు రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకుడు బత్తల వెంకట్రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహులు, హుస్సేన్, వీరభద్రయ్య, మల్లికార్జున, రాజు, మున్నా, రెడ్డెప్ప పాల్గొన్నారు.

మైలపల్లెలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

చిట్వేలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మైలపల్లె చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం హోమం, పూజలు నిర్వహించి సాయంత్రం 5.30 గంటలకు ప్రదోషకాల పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వడ్డె శంకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఎన్ఎస్ఐసీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బెంగుళూరులో ఈ నెల 20న జరిగిన నేషనల్ స్టూడెంట్ ఇన్వేషన్ ఛాలెంజ్‌లో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు ఎన్.లక్ష్మీచైతన్య, ఎస్.జైనాబ్‌లు గోల్డ్‌మెడల్, క్యాష్ రివార్డు గెలుచుకున్నారు. మెంటార్ వరప్రసాద్‌ను చైర్మన్ గొబ్బిళ్ల శ్రీనాథ్ అభినందించారు

'అన్నమాచార్య'లో జాతీయ సెమినార్

రాజంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ ప్రాధాన్యం, మందుల ఉపయోగాలు తదితర అంశాలపై అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ స్వర్ణలత అధ్యక్షతన సెమినార్ ప్రారంభించారు. హైదరాబాదుకు చెందిన మెడికల్ ఇన్నోవేషన్ సీనియర్ సైంటిస్టు డాక్టర్ వందనసింగ్, డాక్టర్ రాజేష్, ప్రొఫెసర్ టి.అంజనకుమార్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేశారు.

డీసీసీ మైనార్టీ చైర్మన్‌గా సయ్యద్ అలీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం చైర్మన్‌గా పట్టణానికి చెందిన సయ్యద్ అలీని నియమిస్తూ ఏపీసీసీ మైనార్టీ చైర్మన్ దాదా గాంధీ శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్‌అలీ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ మైనార్టీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ ఘర్‌కు, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజల భాగస్వామ్యంతో పేదరికం నిర్మూలించాలి

సంబేపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగ స్వామ్యంతో పేదరిక నిర్మూల నసాధించడమే సర్వే ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో రామ చంద్ర, ఏఎస్‌వో హుస్సేన్‌సాబ్ తెలిపారు. శనివారం రౌతు కుంట గ్రామంలో పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్ (పీ4) సర్వే చేశారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న 20 శాతం పేద కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక జీవన స్థితిగతులు మార్చేందుకు పలు సూచనలను, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండి - ఆర్టీసీ బస్సు ఢీ

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు, ఒంటెద్దు బండి ఢీకొన్న ఘటనలో పట్టణంలోని అగ్రహారానికి చెందిన శేషంరాజు తీవ్రంగా గాయ పడ్డాడు. శనివారం కొయ్యల డిపో వద్ద కట్టెలు దించి వస్తుండగా తిరుపతి నుంచి వస్తున్న కడప డిపో బస్సు ఢీకొనడంతో కాలు విరిగి తలపై కుట్లు పడ్డాయని పోలీసులు తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు తప్పనిసరి

రామాపురం/ లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని గోపగుడిపల్లె, కల్పనాయుని చెరువు, దిన్నెపాడు,కోనంపేట,బి ఎర్రగుడి గ్రామాల్లో రిజిస్ట్రేషన్ తీరును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగం ఆధునికీకరణలో భాగంగా ఆధార్ కార్డు తరహాలో ప్రభుత్వం రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ)తో కూడిన కార్డు ఇస్తుందన్నారు. స్వంత భూమిగల ప్రతి రైతు తప్పనిసరిగా తమ వివరాలను వ్యవవసాయ శాఖ సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగమణి, వీపీపీలు శ్రీకాంత్, వాణి, దయానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆటోలకు పోలీసు నెంబర్లు తప్పనిసరి

సుండుపల్లె, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ఆటోలపై పోలీసు సీరియల్ నెంబర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని రాయచోటిరూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. ఆటోల యజమానులు లైసెన్స్, ఆర్‌సీ తీసుకువచ్చి, నెంబరు తీసుకోవాలని సూచించారు. శనివారం ఆయన ఆటో యజమానులకు సీరియల్ నెంబర్లను కేటాయించారు. సీరియల్ నెంబరు లేని ఆటోలు సీజ్ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, వీరబల్లి ఎస్ఐ మోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్థిరమైన జీవనోపాధి కల్పించుకోవాలి

వీరబల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):స్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలు సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి తదితర రుణాలను సక్రమంగా చెల్లించి అధిక రుణాలను పొందాలన్నారు. సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, గంగాధరం, సుధాకర్, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి లావణ్య.

'కార్మికులకు శాపం.. కూటమి ప్రభుత్వం'

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు కార్మిక వర్గాలను భయాందోళనకు గురిచేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు తెలిపారు. శనివారం అప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కరోనాలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన మున్సిపల్ కార్మికు ల ఉద్యోగాలను పర్మినెంట్ చేయకపోగా, ఆప్కాస్‌ను రద్దు చేసి, ఆ బాధ్యతలను దళారీలకు కట్టబెట్టే యోచనను కూటమి ప్రభుత్వం మానుకోవాలన్నారు. వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

సంబేపల్లె, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం సంబేపల్లె హైస్కూల్‌లో ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రైల్వేకోడూరు: రైల్వే కోడూరులో కాపు నాయకుడు మందల నాగేంద్ర నివాళి అర్పించారు. సర్పంచ్ బుడిగి శివయ్య, కాపు నాయకులు రత్తయ్య, చెన్నంశెట్టి పురుషోత్తం, పవన్, వాసాబాబు, హరి, పంద్రారంబాబు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో మంత్రి సోదరుడి పూజలు



పూజలు చేస్తున్న డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె గ్రామం పాత మేదరపల్లెలోని బ్రహ్మసూత్ర మరకత లింగం ఆలయంలో నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, ఆయనను సన్మానించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

నందలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి ప్రిసైడింగ్ అధికారి నందకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శనివారం 19వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. 14 పంచాయతీల్లో రూ.71,889 అవకతవకలు జరగడంతో, రూ. 18557 రికవరి చేసినట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పించండి

సిద్దవటం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణులకు చట్టాలపై అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్‌జడ్జి విజయలక్ష్మి సూచించారు. న్యాయ సలహాలపై పారా వలంటీర్లకు శనివారం నిర్వహించి అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. దీర్ఘకాలిక పెండింగ్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు.

గిరిజన బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని శనివారం జిల్లా ఐదవ జిల్లా కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న తనిఖీ చేశారు. తరగతి గదులను, డార్మెటరీ, వంట గదులను స్టోర్ రూమును పరిశీలించి, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను తెలియజేయాలని వసతి గృహ సంక్షేమ అధికారులకు సూచించారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

మార్చి 8వ తేదీన రాయచోటి కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి తెలిపారు. శనివారం సాయంత్రం రాయచోటి కోర్టులో పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో కేసులు వచ్చే విధంగా చూడాలన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సిద్దవటం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలం అభివృద్ధి కార్యాలయం సభాభవనంలో శనివారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మండలంలో ఎంపీటీసీ సభ్యులు 11 ఉండగా ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక వాయిదా పడింది. ఎ ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఫణిరాజకుమారి మాట్లాడుతూ సమావేశం జరపడానికి నలుగురు ఎంపీటీసీలు ఉండాలని, కోరం లేకపోవడంతో సభ వాయిదా వేశామని, శివరాత్రి ఉత్సవాలు అయిపోయాక తేదీ ప్రకటిస్తామని అన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతదేహానికి టీడీపీ నేతల నివాళి

సిద్దవటం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతిచెందిన బొగిడివారిపల్లె ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కొండయ్య కుటుంబాన్ని శనివారం ఉదయం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి హరిప్రసాద్, పంచాయతీరాజ్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కుప్పాల వెంకటసుబ్బయ్య పరామర్శించారు. పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని సం బంధిత అధికారులు తక్షణమే మట్టి ఖర్చులు మంజూరు చేయాలన్నారు వారి కుటుంబానికి ఉద్యో గం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి ఎళ్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ ముగ్గురికి గాయాలు

చిన్నమండెం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సాగర్ అనే వ్యక్తి శనివారం సూపర్ ఎక్స్ఎల్ వాహనంలో బెంగుళూరు జాతీయ రహదారిపై వెళుతూ దేవపట్ల క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుకవైపు నుంచి ఇర్ఫాన్ అనే వ్యక్తి డిస్కవరీ వాహనంతో వేగంగా ఢీకొనింది. దీంతో రెండు వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.



- ఆవులు మాంసం తినే అరుదైన క్షేత్రం
- బండెన్న, అక్కదేవతలు కొలువైన ఆలయం
- బండెన్న దర్శనం ఆడవాళ్లకు నిషేధం
- శివరాత్రికి మూడు రోజుల వేడుక

పాలకొండల్లో మల్లికార్జునుడు

ఆవు శాఖాహారి.
పాలతల బండెన్న గుడి పరిసరాల్లో మాత్రం ఆవు మాంసాహారి. ఈ వింత చూడాలంటే.. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పంచాయతీ పరిధిలోని పాలతల మల్లేశ్వరస్వామి ఆలయం సందర్శించాలి. కడప నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే శేషాచలం సానువుల్లో భాగమైన పాలకొండల్లోని ఈ గుడికి చేరుకోవచ్చు. మహాశివరాత్రికి మూడు రోజులపాటు వైభవంగా వేడుకలు జరిగే ఆలయం ఇది. ప్రకృతి అందాల నడుమ వెలసిన ఈ ఆలయ సందర్శన గొప్ప అనుభూతిని ఇస్తుంది.

- పెండ్లిమర్రి, ఆంధ్రజ్యోతి



పశువులకు మేతగా మాంసం

వేట నరికి వండిన మాంసం మిగిలితే తీసుకువెళ్లరాదని నమ్మకం. దీంతో అక్కడే వదిలేస్తారు. ఇక్కడ తిరుగులాడే ఆవులు, ఎద్దులు ఈ మాంసాన్ని తినడం అలవాటు చేసుకున్నాయి. ఈ అలవాటే బండెన్న ఆలయ ప్రాంగణంలోని 200 పశువులను మాంసాహారులుగా మార్చేశాయి.

అక్కదేవతల సమక్షం



ఈ ప్రాంగణంలో పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం, పులి బండెన్న, పుట్ట ఆంజనేయస్వామి, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, కాశిరెడ్డి నాయనలను దర్శించుకోవచ్చు. ఈ క్షేత్రంలో అన్న బండెన్న సహా ఏడుగురు అక్కదేవతలైన పెద్దవారమల్లమ్మ, చిన్నవారమల్లమ్మ, నాగమునెమ్మ, దేవ కన్యక, సూర్యకన్యక, చంద్రకన్యక, మల్లమ్మలు ఉంటారు. మహిళలు తడిగుడ్డలతో వచ్చి అక్కదేవతలను ప్రార్థిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. బండెన్న ఆలయం వద్దకు మాత్రం మహిళలకు ప్రవేశం నిషేధం.

బండెన్న కత



బండెన్నకు మాంసాహారం సంబంధించి స్థానికంగా ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం బండె న్న అనే రాక్షసుడు ఇక్కడ ఓ బండపైన ఉండేవాడు. పెళ్లి కాలేదు. అడవి జంతువులను వేటాడి తినేవాడు. భీకరాకారుడైన బండెన్నను ప్రసన్నం చేసుకోవడానికి ఈ ప్రాంతీయులు పూజలు చేసేవారు. బండెన్నకు ఇష్టమైన మాంసాహారం నైవేద్యంగా పెట్టేవారు. వారి మొక్కులు ఫలించేవని ప్రచారం కావడంతో ఆలయం వద్ద వేటలు నరికి మాంసాహారం వండి నైవేద్యంగా పెట్టి భోజనాలు చేయడం ఆచారంగా మారింది. బ్రహ్మచారి కావడం వల్లే ఆడవాళ్లు బండె న్న సమక్షంలోకి వెళ్లరాదని చెప్పుకుంటారు. మాంసం వండడం మొదలు, వడ్డింపుల దాకా బండెన్న ముం దు పనులన్నీ మగవాళ్లే చేస్తారు.

నిత్యాన్నదానం

ఆలయం ఎదురుగా వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిత్యం అన్నదానం చేస్తుంటారు. ఒక్క శివరాత్రి రోజే లక్షలాది మంది భక్తులకు భోజనాన్ని వడ్డిస్తారు.



కృష్ణానాయక్
ఈఓ,దేవస్థానం

మహాశివరాత్రికి పాలతలలో చేపడుతున్న ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ కృష్ణానాయక్ ఆంధ్రజ్యోతికి వివరాలు తెలిపారు.

రవాణా సౌకర్యం...

పాలతల క్షేత్రానికి భక్తులు చేరుకునేందుకు ఘాట్ రోడ్డు ఉన్నందున కండీషన్‌లో ఉన్న 150 బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, రాయచోటి డిపోల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. కొండపైన టూవీలర్, ఫోర్‌వీలర్, భారీ వాహనాలు, ఆర్టీసీకి ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు.

వసతులు...

ఆలయం వద్ద ఉన్న కోనేర్లను శుభ్రం చేశారు. తాగు నీటికి ఇబ్బందులు లేకుండా 8 బోర్లు అందుబాటులో ఉన్నాయి. అంతేకా కుండా మరో 18 నీళ్ల ట్యాంకర్లు సిద్ధంగా ఉంచాము. వైద్య సేవల నిమిత్తం 108, 104, ప్రైవేటు అంబులెన్స్‌లు, భక్తులు తప్పిపోతే అనౌన్స్‌మెంట్, పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేసి ఉంచాము.

భక్తుల భద్రత

అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేశాము. పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ప్రత్యేకించి కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ నిఘా పెడుతున్నాము. ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది, అదనంగా మరో 150 మంది సేవకులు ఉంటారు.

ఉత్సవాలు ఇలా...

మూడు రోజులు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాము. మొదటి రోజు బుధవారం ఉదయం 9.30 గంటలకు ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవం, రాత్రి పది గంటల నుంచి రథోత్సవం, హరికథ, చెక్కభజన, ఉచిత అన్నదానం, ప్రసాదం భక్తులకు అందిస్తాము. మద్యం విక్రయాలు జరపరాదని, ఆంక్షలు అతి క్రమిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.



చేరుకునే మార్గం...

- కడప నగరం నుంచి మూలవంక మీదుగా 25 కి.మీ. వెళ్లి కొండకు చేరుకోవచ్చు.
- పులివెందుల మీదుగా వచ్చే వారు వెల్లటూరు నుంచి తిప్పిరెడ్డిపల్లె మీదుగా చేరుకోవచ్చు.



అక్కదేవతల ఆలయం వద్ద ఉన్న కోనేరు

వివాదాస్పద భూమిలో ప్రహరీ కూల్చివేత



ఫెన్సింగ్‌ను కూల్చేస్తున్న బాధితులు

కురబలకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీప మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న వివాదాస్పద భూమిలో సిమెంట్ పలకలతో నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. సర్వేనెంబర్ 220లో 69.42 ఎకరాల భూమిలో 7.66ఎకరాల భూమిపై కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ భూమిలో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆ భూమిపైకి ఎవరూ వెళ్లకుండా 145సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో కొందరు పులివెందుల వాసులు భూమిని ఆక్రమించు కోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో స్థానిక నేతలు వారికి సహకరించడంతో వివాదం నెలకొంది. దీంతో అప్పట్లో వైసీపీ నేతలు జోక్యం చేసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి డబ్బు వసూలు చేసి సెటిల్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. తిరుపతి, అనంతపురానికి చెందిన పలువురు భూమిని ఆక్రమించారు. మొదట్లో హక్కుదారులు అడ్డుకున్నా తాజాగా ఈ భూమి తమకు చెందుతుందని స్థానికుల అండతో అనంతపురానికి చెందిన కొందరు భూమిలోకి జొరబడి కూసాలు నాటి వెళ్లిపోయారు. రెండు నెలల అనంతరం దాదాపు 100మందితో ఆ భూమిలో సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మించి వెళ్లిపోయారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు శనివారం పెద్దసంఖ్యలో చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు సర్ధిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం ప్రహరీని కూల్చి తమకు న్యాయం చేయాలని కోరారు.

గురుకుల విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డు



కలికిరి విద్యార్థినుల ప్రదర్శనను అభినందిస్తున్న విప్రో ప్రతినిధులు

కలికిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డును శనివారం అందజేశారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ(బెంగళూరు)లో రెండు రోజులు జరిగిన అవార్డు ప్రదానోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం విజేత విద్యార్థినులకు రూ.50 వేల నగదు, అవార్డును అందజేశారు. విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈఓ అనురాగ్ బెహర్ విద్యార్థినులకు అవార్డులు అందజేశారు. వివిధ విభాగాల అంశాలను విప్రో, అజీమ్ ఫౌండేషన్ ప్రతినిధులకు కోఆర్డినేటర్ అప్సానా వివరించారు. ఉత్తమ ప్రదర్శనకు కలికిరి విద్యార్థినులకు వేర్వేరుగా వివిధ రకాల బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సీపీ రామస్వామి ఎన్విరాన్‌మెంటల్ ఎడుకేషన్ సెంటర్ (సీపీఆర్ఈఈసీ) ఉమ్మడి ఏపీ కోఆర్డినేటర్ వెంకటరత్నం, విద్యార్థినుల కోఆర్డినేటర్, కలికిరి జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అప్సానా, విద్యార్థినులు కె.ఖ్యాతి, జె.రూపిక, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

రూ.2లక్షల 40వేలు విలువైన గంజాయి స్వాధీనం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీకేపల్లె, మంజునాథ కాలనీకి చెందిన ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపిన డీఎస్పీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారం చేస్తున్న బీకేపల్లె మంజునాథ కాలనీ వాసి గంటా భాగ్యమ్మ, గంజాయి విక్రయిస్తున్న లక్ష్మీనగర్ వాసి ఆవుల శివమ్మ ఇళ్లలో సోదాలు నిర్వహించి వారి నుంచి రూ. 2లక్షల40 వేలు విలువైన 20 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను టూటౌన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ రహిమ్ముల్లా, సిబ్బందితో, క్రైం ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, క్రైం ఎస్ఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి న్యూ బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. భాగ్యమ్మపై పుంగనూరు, పలమనేరు, పీటీఎం పోలీస్‌స్టేషన్లలో మూడు గంజాయి కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. మదనపల్లె వన్ టౌన్, రూరల్ సీఐలు ఎరిసావలి, సత్యనారాయణ, క్రైమ్ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదవారికే ఇంటి పట్టా అందాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేదలకే ఇంటి పట్టా అందాలని, అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వీఆర్‌ఓలకు ఇళ్ల పట్టాలు, రీవెరిఫికేషన్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇంటి స్థలం పట్టా అందాలని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ద్వారా అనర్హులను గుర్తించి వారికి ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దు చేయాలని ఆదేశించారు. కొందరు లబ్ధిదారులు అనర్హులైనా ఇంటి స్థలం పట్టా పొందాలని, వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. 2019 అక్టోబరు 15 నాటికి అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో కుటుంబం నివసించేందుకు అనువైన నిర్మాణాన్ని చేపట్టి ఉంటే నిర్మాణానికి సంబంధించిన ఆధారాలను నిర్మాణం చేపట్టిన వారి దగ్గర నుంచి తీసుకుని పరిశీలించిన అనంతరం క్రమబద్ధీకరణ చేయాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేయాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తను కోరారు. మంగళగిరిలోని కార్యాలయంలో శనివారం వారు డీజీపీని కలిశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ నిమిత్తం గతంలో ప్రత్యేక అధికారి ఉండేవారని, తద్వారా కేసుల విచారణ వేగంగా జరిగేదన్నారు. జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు.

ప్రతి విద్యార్థి కలలను సాకారం చేసుకోండి

టెక్నోకల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25లో సినీనటి నేహాశెట్టి



సినీనటి నేహాశెట్టికి జ్ఞాపికను అందిస్తున్న మిట్స్ యాజమాన్యం

కురబలకోట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తమ కలలను సాకారం చేసు కోవాలని సినీనటి నేహాశెట్టి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25లో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ళ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.

బాలిక అదృశ్యం

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జయనగర్‌కాలనీలో జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూలులో టెన్త్ చదువుతున్న బోయ రాజేశ్వరి అనే బాలిక అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. అశోక్‌నగర్ వాసి బోయహనుమంతు కుమార్తె రాజేశ్వరి శనివారం స్కూలుకు పోతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం తెలిస్తే సీఐ 9121100520, ఎస్ఐ 9121100521కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉంది

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సాహిత్యాల్లో ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రత్యేకించి కడప ఉర్దూ సాహితీ చరిత్ర ఘనమైందని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. శనివారం యోగివేమన యూనివర్సిటీ ఉర్దూ విభాగ అధిపతి ఆచార్య కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో 'కడపలో ఉర్దూ సాహిత్యం' అంశంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ఉర్దూ సాహిత్యంలో కడప సాహిత్యానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు.

ఏప్రిల్ 4 వరకు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లవద్దు

జేసీని కలిసిన ఆకేపాటి లాయర్లు ● తహసీల్దార్‌కు జేసీ ఆదేశం

రాయచోటి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్ జోలికి ఏప్రిల్ 4 వరకు వెళ్లవద్దని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రాజంపేట తహసీల్దార్ పీర్‌మున్నీని ఆదేశించారు. రాజంపేట మండలం మందపల్లె రెవెన్యూ విలేజ్ పరిధిలోని పలు సర్వేనంబర్లలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూములను అమరనాథరెడ్డి, అతడి కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని ఎస్టేట్ నిర్మించుకున్నారని.. రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి నాలుగు నెలల కిందట ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతో కలెక్టర్ స్థానిక సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయించారు. ఈ విచారణలో ప్రభుత్వ భూములు ఆకేపాటి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్నట్లు తేలింది. దీంతో శనివారం తన ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అమరనాథరెడ్డి తదితరులకు నోటీసులు ఇచ్చారు. అయితే శనివారం జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు అమరనాథరెడ్డి హాజరు కాలేదు. ఆయన తరపున న్యాయవాదులు హాజరయ్యారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ నోటీసులపైన కోర్టును ఆశ్రయించామని, తమ పిటిషన్ ఏప్రిల్ 4న విచారణకు వస్తుందని, అప్పటి వరకు రాజంపేట రెవెన్యూ అధికారులు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లకుండా చూడాలని కోరారు. దీంతో ఏప్రిల్ 4 వరకు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లవద్దని జాయింట్ కలెక్టర్ రాజంపేట తహశీల్దార్‌ను ఆదేశించినట్లు సమాచారం

పురపాలికలో ప్రొటోకాల్ రగడ

● బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు



చైర్‌పర్సన్ మనూజను ప్రశ్నిస్తున్న వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలో ఎక్కడా ప్రొటోకాల్ పాటించడం లేదని వైసీపీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమైనా, ప్రతినెలా పింఛన్ పంపిణీ అయినా ఇదే పరిస్థితి ఉందని వారు వాపోయారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై తీవ్ర దుమారం రేగింది. వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్ కె.ప్రసాద్‌బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ పోడియం ముందు వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్ ఆజాం, కౌన్సిలర్లు బైఠాయించారు. అటు చైర్‌పర్సన్ మనూజ, ఇటు కమిషనర్ కె.ప్రమీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన తమను కనీసం తమ వార్డులో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానిస్తున్నారని మండిపడ్డారు. తాము ఎక్కడికి వెళ్లినా పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. కౌన్సిల్ సమావేశానికి కూడా వారినే పిలిపించుకుని సమావేశం నిర్వహించాలని, అజెండా ఆమోదం(సీఆర్)కూడా వారి నుంచే చేయించుకోవాలని ధ్వజమెత్తారు. ఎక్కడా కూడా కౌన్సిలర్లకు గౌరవం తగ్గకుండా, ప్రొటోకాల్‌ను అమలు చేస్తామన్న హామీతో ఆందోళన విరమించారు.

ఆర్థిక పరిపుష్టితో జిల్లా ముందుకు

కేంద్ర ఆర్థిక సేవా రంగ డీడీజేఎం జయశ్రీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, అన్ని ప్రమాణికాల్లో జిల్లా ముందంజలో కొనసాగడం అభినందనీయని కేంద్ర ఆర్థిక సేవా రంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.జీ.జయశ్రీ అన్నారు. శనివారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన ఆకాంక్షిత జిల్లాలో 'ఆర్థిక పరిపుష్టికి పర్ఫార్మెన్స్ ఇండికేటర్' అంశంపై బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఆమెతో పాటు కెనెరా బ్యాంక్ డీజీఎం ఆర్తిఅగర్వాల్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. డీడీజేఎం మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా 'ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి' అంశాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచనందుకు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అత్యుత్తమ పురస్కారం బహూకరించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారం వరించగా అందులో వైఎస్సార్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించగ్గ విషయమన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధనం, నాబార్డు ఏజీఎం విజయవిహారి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై ఇరువర్గాల ఘర్షణ

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భూ వివాదంపై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. చియ్యవరం పంచాయతీ పరిధి మొలకలపోడు హరిజనవాడ వాసులు ఇంద్రమ్మ, గుండాల పెంచలయ్య మరో ఇద్దరు ప్రభుత్వ భూమిలో పనులు చేస్తుండగా గుండాల రవి కుమార్‌కు చెందిన మరో వర్గం అడ్డుపడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ వద్ద భూమి పత్రాలు ఉన్నాయని వాదోపవాదాలు పడి ఘర్షణకు పాల్పడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.

దివ్యాంగుల క్రికెట్‌లో రాణించిన శివకోటి



నందలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల క్రికెట్‌లో భాగంగా నేపాల్‌తో జరిగిన టీమ్ 20 క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు తరపున పాల్గొన్న నందలూరు వాసి ఏల్చూరు శివకోటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. శివకోటి మాట్లాడుతూ నేపాల్‌జట్టును భారత జట్టు క్లీన్‌స్వీప్ చేసిందన్నారు. తాను భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మూడు టీ20 మ్యాచ్‌ల్లో 72 పరుగులు చేసి 11 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా ఎంపికయ్యాయన్నారు. ఫిబ్రవరి 14 నుంచి 20వ తేదీ వరకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగిన క్రికెట్ చివరి మ్యాచ్‌లో కెప్టెన్ అవకాశాన్ని అంది పుచ్చుకుని అద్భుతమైన ఆటతో భారత జట్టును విజయ తీరాలకు చేర్చానన్నారు. క్రీడా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె వాసి సింగయ్యగారి లక్ష్మీ కనపడలేదని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం నుంచి ఇంటినుంచి వెళ్లిన ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు ఎస్ఐకి 9121100580 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

25, 26న పులివెందులకు జగన్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైసీపీ నేత వైఎస్ జగన్ 25, 26 తేదీల్లో పులివెందులలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో భాకరాపురంలోని హెలీప్యాడ్‌ను శనివారం అర్బన్ సీఐ నరసింహులు పరిశీలించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ 26న ఉదయం పులివెందులకు చేరుకుని ఆయన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. 26న రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో కొత్తగా నిర్మించిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. దీంతో పులివెందులలో రెండు రోజుల పర్యటన ముగియనుంది. మాజీ సీఎంపర్యటన సందర్భంగా బందోబస్తులో భాగంగా అర్బన్ సీఐ నరసింహులు పరిశీలించారు.

సిద్దేశ్వర ఆలయ భూములు కాపాడండి

● త్రిసభ్య కమిటీకి కలమల్ల గ్రామస్థుల వినతి




ఆలయ భూములపై కలమల్లవాసులతో చర్చిస్తున్న ఆర్డీవో

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కలమల్లలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయ 63 ఎకరాల మాన్యం భూముల విషయంలో న్యాయం చేయాలని కలమల్లవాసులు శనివారం త్రిసభ్య కమిటీకి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సాయిశ్రీ, మల్లికార్జునప్రసాద్, తహసీల్దార్ శోభన్‌బాబు, జిల్లా సర్వేయర్ శనివారం కలమల్లలోని ఆలయాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. టెంపుల్ సర్వేనెంబర్లు, మొత్తం భూముల వివరాలను సేకరించారు. అలాగే శాసనాలను తిలికించి వాటి వివరాలు తీసుకున్నారు. గ్రామస్థులు అధికారులకు పూర్తి వివరాలు అందజేశారు. వీటిపై సమగ్రంగా విచారించి ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని అధికారులు వెల్లడించారు. ఇటీవలే గ్రామస్థులు ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు క్రిష్ణయ్య, పుల్లారెడ్డి, కమిటీకి చెందిన శంకరయ్య, గిరి, సాంబశివారెడ్డి, రామాంజనేయులు, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

గోపవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపవరం గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.లక్ష నగదు తీసుకువెళ్లారని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం గ్రామస్థులు ఆలయంలో పరిశీలించి విషయం తెలుసుకున్నారు. హుండీని ఆలయం వెనుక తీసుకెళ్లి పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

పది పరీక్షలు.. ఇక 22 రోజులే



● విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

● మెలకువలు పాటిస్తే.. విజయం మీదే

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు ఇక 22 రోజులే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా డిసెంబరు 1 నుంచి వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌ను ఉన్నతాధికారులు అమలు చేశారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. 2025 మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు జిల్లాలోని అన్ని యాజ మాన్య పాఠశాలల నుంచి 27,833 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా సమయం దగ్గర పడుతుండడంతో విద్యా ర్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణుల య్యేందుకు వీలుగా సబ్జెక్టు నిపుణుల ద్వారా అభ్యాసన మెలకువలు తెలియజేశారు.

గణితంలో ఆరు అంశాలు చదవండి

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు



గణితంలో కనీస స్థాయి ఉన్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పొందాలంటే వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జత, పాఠ్యాంశాలలో ముఖ్యమైన సమస్యలను నేర్చుకోవాలి. రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జతలోని గ్రాఫ్ 8 మార్కులకు ఖచ్చితంగా వస్తుంది. నిరూపక జామితి పాఠ్యాంశం నుంచి సెక్షన్ ఫార్ములాకు చెందిన సమస్యలు నాలుగు లేదా ఎనిమిది మార్కులకు వచ్చే అవకాశం ఉంది. సాంఖ్యక శాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌పై తప్పక 8 మార్కుల ప్రశ్న ఉంటుంది. ఈ సూచనలను పాటించి ప్రాక్టీస్ చేస్తే ప్రతి విద్యార్థి గణితంలో సులభంగా ఉత్తీర్ణత పొందుతారు.

సాంఘిక శాస్త్రంలో శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు

- షేక్ మహబూబ్‌షరీఫ్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉంది. సాంఘిక శాస్త్రంలో విద్యార్థులు సరైన శ్రద్ధ వహిస్తే మంచిమార్కులు సాధించడం పెద్ద కష్టం కాదు. ఇందులో కొన్ని సూచనలు పాటించడం అవసరం. ఎస్‌సీఈఆర్‌టీ వారు ఏ పాఠంలో ఎన్ని మార్కులకు ప్రశ్న వస్తుందో క్లియర్‌గా అందజేసిన బ్లూప్రింట్‌ను విద్యార్థులు అనుసరించాలి. అదేవిధంగా వారు అందజేసిన మూడు మోడల్ పేపర్లను క్షుణ్ణంగా నేర్చుకోవాలి. భారతదేశం, ప్రపంచపటంలోని అంశాల పట్ల బాగా శ్రద్ధ పెట్టాలి. పరీక్ష సమయంలో జవాబు రాయడంతో పాటు ముఖ్యమైన విషయాలను అండర్ లైన్, హైలెట్ చేయడం ద్వారా మంచి మార్కులను పొందవచ్చు.

తెలుగులో దోషాలు రాకుండా చూడాలి

- డి.చెంగల్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు

తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 20 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్యభాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంకాలు, చందస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలొస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతో పాటు రామాయణం ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఇంగ్లీష్‌లో ప్యాసేజ్ అంశాలపై పట్టుండాలి

- టి.జాన్ సుందర్‌రాజు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు



ఇంగ్లీష్‌లో ఎడిటింగ్, ప్యాసేజ్ అంశాలపై ప్రధానంగా పట్టు సాధించాలి. యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్ వంటి అంశాలను చదవాలి. ఒకాబులరీ, గ్రామర్, టెక్ట్స్ టూల్‌ను ఎక్కువగా సాధన చేయాలి. రెయిమ్స్, స్కీమ్, పొనెటిక్స్‌ను చదివితే సులువుగా రాయవచ్చు.

ఇంటిపన్నుల బకాయిలపై మున్సిపల్ అధికారుల చర్యలు

● ఒక్కరోజే రూ.32.27 లక్షల మొండి బకాయి వసూళ్లు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల బకాయిలపై మున్సిపల్ అధికారులు చర్యలకు దిగారు. శనివారం పట్టణంలో గాంధీరోడ్డులో గల ఒక మొండిపన్ను బకాయిదారుడి బట్టల దుకాణాన్ని కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.19 కోట్లు బకాయిలున్నాయన్నారు. ముఖ్యంగా టాప్ 100లో వున్న లక్షల మొండిబకాయిదారుల దుకాణాలు, ఇళ్లకు తాళాలు వేస్తున్నామన్నారు. ప్రతి రోజు రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి టార్గెట్ పెట్టామని తెలిపారు. మార్చి 15 నాటికి 80 శాతం వసూళ్లు పూర్తి చేసేందుకు ప్రతిరోజు సచివాలయాల సిబ్బందితో సహా కార్యాలయం సిబ్బందిని కలెక్షన్‌కు వినియోగిస్తామన్నారు. శనివారం ఒక్కరోజే రూ.32.27 లక్షలు వసూలు చేశామని, పన్నులు వస్తేనే ఉద్యోగులందరికి జీతాలు లేకుంటే జీతాలుండవని హెచ్చరించామన్నారు. ఈ పన్ను వసూళ్లలో ఆర్ఐ శివచరణ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు ఇవ్వలేదని.. చేయి కోసుకున్న ఏఎన్ఎం

చాపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయం వద్ద సింధు అనే ఏఎన్ఎం శనివారం సాయంత్రం గాజుతో తన ఎడమచెయ్యి కోసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈమె ఇక్కడ రెండేళ్లుగా పనిచేస్తోంది. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ గ్రామం ఉంది. అక్కడ జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న కావ్యమాధురిని సెలవు ఇవ్వాలని కోరగా ఆమె ఇవ్వలేదని సిబ్బంది తెలిపారు. డిగ్రీ దూర విద్యకు సంబంధించి ఈ నెల 24 నుంచి పరీక్షలు రాసేందుకు సెలవులు కావాలని సింధు డాక్టర్‌ను కోరగా.. సెలవు ఇవ్వలేదు. దీంతో చెయ్యి కోసుకున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయమై చాపాడులోని పీహెచ్‌సీ సీనియర్ డాక్టర్ రాజేష్‌కుమార్‌ను వివరణ అడుగగా.. సింధు చెయ్యి కోసుకున్న విషయం వాస్తవమేనన్నారు. ఆమె ఇటీవల 15 రోజులు సెలవులు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం ఈ విషయమై పూర్తి విచారణ చేస్తామన్నారు.

అభివృద్ధికి పరిశుభ్రతే మూలం: డీపీవో



చెన్నూరు మైనార్టీ కాలనీలో వీధులు శుభ్రం చేస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి పరిశుభ్రతే మూలమని, ప్రజలు తమ గ్రామంతో పాటు వారి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు మండలంలోని చెన్నూరు, రామనపల్లె, కొండపేట గ్రామాల్లో ఈవోఆర్డీ సురేశ్‌బాబుతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల ముందు ఉన్న చెత్తచెదారాన్ని నిత్యం తొలగించుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగినప్పుడే వారి కుటుంబసభ్యులు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడుపుతారన్నారు. ఈ సందర్భంగా డీపీవో గ్రామాల్లో ఈవోఆర్డీతో కలిసి చీపురు చేతబట్టి చెత్తచెదారాన్ని తొలగించిశ్రమం చేశారు. అలాగే ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త ఎలా సేకరిస్తున్నారు. ఇల్ల వద్దకు వచ్చిన వారికి ఎలా ఇంటిలోని తడి పొడి చెత్త వేస్తున్నారని ప్రశ్నించి ఏది ఎలా అందివ్వాలో చెప్పడం జరిగింది. అంతేగాక ఈ మూడుపంచాయతీలోని వర్మీకంపోస్టు కేంద్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గురువేశ్వర్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, హరిత రాయబార లుఉ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన వుండాలి

● సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

కడపరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన వుండాలని, తద్వారా ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి తెలిపారు. శనివారం డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో లీగల్ సర్వీసెస్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు చట్టాల గురించి తెలియజేశారు.

5333 గృహాల్లో న్యాయప్రచారం

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారం 5333 గృహాలలో ఇంటింటా న్యాయ ప్రచారం నిర్వహించి 57 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించామన్నారు. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు, నివారణ కొరకు ఇంటింటి న్యాయప్రచారం చేపడుతున్నామన్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 46 టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టీంలో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారాలీగల్ వలంటీర్, ఏఎన్ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ వర్కర్, వైద్యాధికారి, భవిత సెంటర్ నిర్వహకులు తదితరులు ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రత్యేక సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీడబ్ల్యుఎస్ స్కీంల పనితీరు మెరుగుపడాలి

కడప రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సీపీడబ్ల్యుఎస్ స్కీంల పనితీరును మరింతగా మెరుగు పరిచి ప్రజలకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం కమలాపురం నియోజక వర్గంలోని కమలాపురం, పెండ్లిమర్రి, వల్లూరు ప్రాంతాలలోని సీపీడబ్ల్యుఎస్ స్కీంలను పరిశీలించారు. సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణ, పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణకు ప్రభుత్వం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ఇవి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సీపీడబ్ల్యుఎస్ స్కీం పరిధిలోని ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా కావాలన్నారు. ఇందులో అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

● జిల్లా అధ్యక్షుడిగా బి.క్రిష్ణకుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఏఈఎస్ వినోద్‌నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా బి.క్రిష్ణకుమార్, కడప ఎక్సైజ్ సీఐ అసోసియేషన్ అధ్యక్షుడిగా శశిధర్, ఉపాధ్యక్షుడిగా యల్లయ్య, కార్యదర్శిగా సురేశ్‌కుమార్, ఆర్గనైజరు సెక్రటరీగా విన్నీలత, జాయింటు సెక్రటరీగా హుసేన్‌బాషా, ట్రెజరర్‌గా రాంప్రసాద్, వీసీ మెంబర్లుగా సీతారామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, విశ్వనాథరెడ్డి, హిమబిందు, సుధాకర్, కళ్యాణ్‌కుమార్‌లను ఎన్నికయ్యారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రాప్తాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన మహమ్మద్ రఫిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీహర్ష శనివారం తెలిపారు. కడప జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ.. మొత్తం 8 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడని సీఐ తెలిపారు. నాలుగు జిల్లాలో చోరీ చేసిన సుమారు 47 తులాల బంగారాన్ని బెంగళూరులోని అట్టికా గోల్డ్ కంపెనీలో విక్రయించాడు. వచ్చిన డబ్బుతో కారు, బుల్లెట్, స్కూటీ కొనుగోలు చేశాడు. వాటిని సీజ్ చేశామని సీఐ తెలిపారు. బెంగళూరులో గోల్డ్ కంపెనీకి అమ్మిన మొత్తం బంగారాన్ని రికవరీ చేసేందుకు ఆ కంపెనీకి నోటీసులు జారీ చేశామన్నారు. నిందితుడిపై కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పోలీస్ స్టేషన్లలో పాత చోరీ కేసులు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు.

కలమల్ల ఎస్ఐపై చర్యలు తీసుకోండి

● పోలీసుస్టేషన్ వద్ద బాధితుడు బైఠాయింపు



కలమల్ల పోలీసుస్టేషన్ ముందు బైఠాయించిన గోర్ల ఓబులేసు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కలమల్ల ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన గోర్ల చిన్న ఓబులేసు శనివారం పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ 14.12.2024న కలమల్లకు చెందిన పొన్న శివతో ప్రాణహాని వుందని ఎస్పీకి ఫిర్యాదు చేశానని, అది సీఐ ద్వారా కలమల్ల ఎస్ఐకి రెఫర్ చేశారన్నారు. అలాగే 27.01.2025న తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించి వేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. ఈ రెండు ఫిర్యాదుల విషయంపై బుధవారం ఎస్ఐ తిమోతిని కలిసి తన ఫిర్యాదులకు న్యాయం చేయాలని అడగ్గా తనను దూషించినట్లు ఆరోపించారు. అంతేకాకుండా కలమల్ల చుట్టూ ఆటవిక రాజ్యం కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించారు.

చర్యలు తీసుకుంటాం: సీఐ రఫి

స్టేషన్ ఎదుట బైఠాయించిన గోర్ల చిన్నఓబులేసు విషయంపై కొండాపురం సీఐ రఫీ మాట్లాడుతూ పొన్నా శివపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు అనుమతి కోసం ఎదురు చూస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చేస్తామన్నారు. అలాగే ఓబులేసు ఫిర్యాదు చేసిన ఇతర విషయాలపై కూడా పరిశీలిస్తామని తెలిపారు.

ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా

- లక్షల్లో ఆదాయం ఉన్న కష్టాల్లో కలకడ వారపు సంత
- వాన పడినా.. ఎండ కాసినా ఇబ్బందులు
- రోడ్లపై అంగళ్లతో ట్రాఫిక్ సమస్య


గుడారాల నడుమ కలకడ వారపు సంత

కలకడ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలకడలో జరిగే వారపు సంతకు లక్షల్లో ఆదాయమున్న సౌకర్యాలు మాత్రం శూన్యం. ప్రతి బుధవారం రోజున ఇక్కడ సంత జరుగుతుంది. కూరగాయలు, నిత్యవసర వస్తువులు తదితర అంగళ్ల వందల సంఖ్యలో ఏర్పాటు చేస్తారు. కలికిరి, గుర్రంకొండ, రాయచోటి, పీలేరు, మహల్‌ల నుంచి వ్యాపారులు ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుతారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వారపు సంత నిర్వహిస్తున్నారు. వార్షిక వేలం పాటలో గేట్‌ను దక్కించుకొన్న కాంట్రాక్టర్ నిర్ణీత రుసుమును వ్యాపారుల నుంచి వసూలు చేస్తారు. ఈ వేలం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.14.15 లక్షలు, ఈ ఆర్థిక సంవత్సరంలో 13.25 లక్షల ఆదాయం చేకూరింది. అయితే పంచాయతీకి ఇంత ఆదాయమున్న కనీస సౌకర్యాలైన తాగు నీరు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్ల నిర్వహణపై పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపడం లేదని వ్యాపారులు, కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2009వ సంవత్సరంలో రూ.5 లక్షల వ్యయంతో నాబార్డు నిధులు ఖర్చు చేసి ప్రహరీ గోడకు అనుకొని వ్యాపారులకు అనువుగా రేకుల వరండాను ఏర్పాటు చేశారు. కానీ దానిని పూర్తి స్థాయిలో వినియోగంలోని తీసుకొచ్చే విషయంలో అధికారులు చొరవ చూపడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో వ్యాపారులు సొంతంగా గుడారాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహించుకొంటున్నారు.

వర్షం పడినా..ఎండ కాచిన ఇబ్బందులే..

వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకొన్న స్థలం ఎత్తుపలాలుగా ఉండడంతో వర్షం పడినప్పుడు నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో కొనుగోలుదారులు అవస్థలు అన్నీఇన్నీ కావు. అదే విధంగా వేసవిలో నీడ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్లపై దుకాణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు

సరైన పర్యవేక్షణ లేక కొని దుకాణాలు రోడ్లపై వెలుస్తున్నాయి. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి కావడంతో పెద్ద సంఖ్యలో ఒక సారి వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో ప్రజలు ప్రమాదాల భారిన పడుతున్నారు.

సౌకర్యవంతగా మారుస్తాం

కలకడ వారపు సంతను వ్యాపారులకు, కొనుగోలుదారులకు సౌకర్యావంతంగా మారుస్తాం. అంసతృప్తిగా ఉన్న పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుని సమస్యను పరిష్కారిస్తాం

- అబ్దుల్‌రహీం, ఎంపీడీవో, కలకడ

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



కలకడ వారపు సంతలో దుకాణాల నిర్వాహణకు షెడ్లు లేవు. సొంతంగా ప్లాస్టిక్ పట్టలతో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నాం. ప్రతియేడు వర్షా కాలంలో సరుకులోకి నీరు చేరి నష్టాల పాలవుతున్నాం. పంచాయితీ గేట్ చెల్లిస్తున్న సరైన సౌకర్యాలు లేవు.

-బాబు, వ్యాపారి, మహల్, కలికిరి మండలం

అధికారులు శ్రద్ధ చూపాలి



జీవనాధారంగా వారపు సంతలో నిత్యవసర వస్తువుల దుకాణం నిర్వహిస్తున్నాను. జిల్లాలోని గాలివీడు, సుండుపల్లె తదితర వారపు సంతలకు వెళుతాను. అక్కడ అన్ని వసతులు అనువుగా ఉన్నాయి. కలకడ వారపు సంతలో వసతుల కల్పనపై అధికారులు శ్రద్ధ చూపాలి.

-వి.రమేష్‌బాబు, వ్యాపారి, కలకడ మండలం

సౌకర్యాలు కల్పించాలి



మా గ్రామం నుంచి ప్రతి వారం ఇంటి సరుకుల కొనుగోలు కోసం కలకడ సంతకు రాక తప్పదు. వర్షాకాలంలో అంగళ్ల ముందు నీరు నిలిచి బురదతో కాలు మోపే అవకాశం ఉండదు. ఇక వేసవి ఇబ్బందులు దేవుడికే ఏరుక. నిర్వాహకులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

-జి.రెడ్డిశేఖర్, కొనుగొలుదారు, కోన గ్రామం, కలకడ మండలం


నిరుపయోగంగా వ్యాపార సముదాయం


వర్షాలకు చిత్తడిగా మారిన వారపు సంత(ఫైల్‌ఫొటో)

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

గుర్రంకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):పొలం వద్ద ఉన్న పాడిఆవులను ఇంటికి తోలుకొని రావడానికి వెళ్లిన మహిళ మెడలో ఉన్న బంగారు బొట్టు గొలుసును గుర్తు దుండగులు లాక్కెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు మండలంలోని అమిలేపల్లె గ్రామానికి చెందిన కె.రెడ్డిరాము, రెడ్డిఉష దంపతులు పాడి ఆవులను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మహిళ పొలం వద్ద ఉన్న పాడి ఆవులను ఇంటికి తోలుకొని వస్తుండగా దుండగులు కళ్లలో కార్రంపొడి చల్లి మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు బొట్టు గొలుసును కత్తిరించి లాక్కెళ్లారు. బాధిత మహిళ గట్టిగా అరవడంతో పొలం వద్ద ఉన్న భర్త రెడ్డిరాము వచ్చేలోపే దుండగులు పారిపోయారు. ఆమేరకు మహిళ రెడ్డిఉష పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదును స్వీకరించి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మదురామచంద్రుడు తెలిపారు.

తమ్ముడిపై అన్న కుటుంబసభ్యుల దాడి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):భూమి భాగపరిష్కారం విషయంలో అన్న కుటుంబ సభ్యులు దాడి చేసి తమ్ముడిని గాయపరిచారు. మదనపల్లె అవుట్ పోలీసుల కథనం మేరకు కురబలకోట మండలం, చింతమాకులపల్లెకు చెందిన గోపాలకృష్ణ (42)ను శనివారం ఉదయం భూమి భాగ పరిష్కారం కోసం మాట్లాడుకొంటూ మాటామాటా పెరిగి తన అన్న సిద్దులప్ప, వదిన లక్ష్మీదేవి, అన్నకుమారుడు మనోహరలు అక్కడే ఉన్న ఇటుకలతో దాడి చేసి తలపై గాయపరిచారన్నారు. దాడిలో గాయ పడిన గోపాలకృష్ణను స్థానికులు మదన పల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని రైతుకు తీవ్రగాయాలు

ములకలచెరువు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివారిల్లెకు చెందిన రైతు వెంకటరనారాయణ (60) ద్విచక్రవాహనంలో వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు మసి వెంకట్రమణ (48)కర్నూల్ జిల్లా, డోన్ బైపాస్‌లోని కరూర్‌రోడ్డు జాతీయరహదారి పై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వెంకట్రమణ మృతి పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బి.కొత్తకోటలోని బైపాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న సీనియర్ నాయకుడు మృతి పార్టీకి తీరనిలోటని ఆమె అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ద్వారా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి మృతుడి కుటుంబాన్ని టీడీపీ కార్యకర్తల సంక్షేమనిధి ద్వారా ఆదుకునే ప్రయత్నం చేస్తామని పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు.

అంగళ్లు టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

కురబలకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు టీఎం రమణ(60) గండెపోటుతో మృతి చెందాడు. అంగళ్ళుకు చెందిన రమణ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పని చేస్తున్నాడు. కాగా విషయం తెలుసుకున్న పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ తదితరులు రమణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. మండలంలోని గట్టు పంచాయతీ గుట్టపాళ్యంకు చెందిన రవీంద్రరెడ్డి తన కుమారుడైన యస్విన్‌రెడ్డి(4) కి జ్వరం వస్తుండటంతో చికిత్స కోసం ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. నాయనబావి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరూ కిందపడి తీవ్రగాయాలయ్యాయి. ఇరువురినీ మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. బి.కొత్తకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

ములకలచెరువు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, కుష్ఠు తదితర వ్యాధులపై జరుగుతున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమ జాయింట్ డైరెక్టర్ దేవ్‌సాగర్ ఆదేశించారు. ములకలచెరువు ప్రభుత్వాస్పత్రిని శనివారం తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారిణి జాహ్నవి, డాక్టర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై దర్శనమిచ్చిన సిద్ధేశ్వరుడు



కలకడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):కలకడ కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు శనివారం శేష వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కోలాటాలు, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వివిధ రకాల పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

ప్రజ్ఞవికాస్ పరీక్షలతో విద్యార్థులకు ఉపయోగం



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజ్ఞావికాస్ పరీక్షల తో టెన్త్ విద్యార్థులకు ఎంతో ఉప యోగం ఉంటుందని జడ్పీహెచ్ఎం సుబ్బారెడ్డి, యూటీఎఫ్ జిల్లా నా యకులు సుధాకర్‌నాయుడు గాలి రవీంద్ర పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలల్లో యూటీఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలతో భయం పోతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమణ, యూటీఎఫ్ నాయకులు నాగరాజు, సురేంద్ర, మదన, అన్వర్‌బాషా, రామచంద్ర, చలపతి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అఫ్రీద్, జయబాబు, సమీర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి


జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై సూచనలిస్తున్న న్యాయాధికారులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):మదనపల్లె కోర్టు సముదాయాల్లో మార్చి నెలలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చే యాలని న్యాయాధికారులు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శిరీష్, అదనపు సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం స్థానిక కోర్టుహాలులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ మార్చి 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. సాధ్యమైనంత వరకు సివిల్, క్రిమినల్, రోడ్డుప్రమాద కేసులు ఇరు కక్షిదారుల సమ్మతిలో రాజీ అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐలు సత్యనారాయణ, ఎరిషావలి, వెంకటరమణ, కోర్టు లైజనింగ్ అధికారి గల్లా సతీష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

కురబలకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. శనివారం మం డలంలోని కురబలకోట తహశీల్దార్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ ఎస్ ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. రీసర్వే జరుగుతున్న గ్రామంలో తప్పులు లేకుండా సర్వే చేయాలన్నారు. సర్వేలను త్వరగా పూర్తి చేయడంతో పాటుగా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్ర మంలో తహశీల్ధార్ తపశ్విని, ఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, వీర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ వర్ధంతి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకిపురం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ, స్వాతంత్ర్య సమయంలో ఆయన వీరోచిత సేవలను కొనియాడారు. మాతృదేశంలోని ప్రజలను బానిసలుగా చేసి దేశ సంపదను దోచుకుంటున్న తెల్లదొరలను ఎదిరించిన నాయకుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. ఈకార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పుష్పలత, ఉమాదేవి, వెంకటేశ్వర, నాగేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

- కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎక్స్ అఫిషియో హోదాలో కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా, కమిషనర్ కె.ప్రమీల, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె నుంచి కుప్పం వరకూ రూ.3వేల కోట్లతో తాగునీటి పథకానికి రూపకల్పన చేసిందని పునరుద్ఘాటించారు. అంతవరకూ పట్టణంలో వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, వార్డుల్లో మూడురోజుల గ్యాప్‌తో నాలుగో రోజు నీటి సరఫరా చేయాలని సూచించారు. పట్టణంలో శానిటేషన్‌పై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది మరింత మెరుగు పడాలన్నారు. అలాగే పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇటు శివరాత్రి, ఇటు రంజాన్ ప్రారంభం నేపథ్యంలో ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని, అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతకుముందు మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ మున్సిపాలిటీ గదుల వేలం పాటల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అయితే నిబంధనల మేరకే ఓపెన్ వేలం వేసినట్లు కమిషనర్ ప్రమీల పేర్కొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తితే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తితే చర్యలు తప్పవని సంబంధిత గ్రామ కార్యదర్శులను స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాని విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి సమీపిస్తుడంతో తాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అయితే ముష్టూరు పంచాయతి దిగువపల్లికు చెందిన గ్రామస్థులు తమకు తాగునీరు అందలేదని పిర్యాదు చేయడంతో ఆగ్రహించిన ఆయన సంబంధిత కార్యదర్శి లోకేశ్వరిని ఎందుకు సమస్య పరిష్కరించలేదని ప్రశ్నించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతి కార్యదర్శులను ఒక్కొక్కరిని పిలిచి వారి గ్రామంలో ఎన్ని స్కీమ్ బోర్లు ఉన్నాయి వాటిలో నీరు వస్తున్నాయ అని అడిగి కొత్త బోర్లు కావా లంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. తాగునీరు అందిచడంలో అలసత్వం వహిస్తే వెంటనే నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. అనంతరం వెంగంవారిపల్లి ,రెడ్డివారిపల్లి పంచాయతీలలో అనారోగ్యం బాధపడుతన్న రోగుల కుటుంబ సభ్యులకు సీఎమ్‌ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరనాథ్, ఈవోపీఆర్‌డీ చలపతిరావు, ఏవో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్ చక్రవర్తి, ఏవో మురళిమోహన్, ఏపీఎం మురళి నేతలు వెంకటరమణ, చినబాబు పాల్గొన్నారు.

మదనపల్లెలో ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణ శివారు ప్రాంతాలోని ప్రధాన కూడలిలో నాలుగు ఏఎన్‌పీఆర్(ఆటోమేటిక్ నెంబరుప్లేట్ రికార్డు)కెమెరాలను అమరుస్తున్నట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నేరాలను, ప్రమాదాలను అరికట్టడంలో భాగంగా పుంగనూరు రోడ్డు వై జంక్షన్‌లో ఒకటి, తట్టివారిపల్లె బైపాస్ సర్కిల్‌లో మరొకటి, అన్నమయ్య సర్కిల్‌లో ఒకటి, చీకలబైలు చెక్‌పోస్టు వద్ద మరొకటి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని వక్తల సహకారంతో మదనపల్లె పట్టణం, శివారుప్రాంతాల్లో 600 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీనికి పట్టణంలోని ప్రముఖుల సహాయ సహకారం అవసరం ఉందన్నారు. మైనర్లకు బైకులు ఇస్తే వారు పట్టు బడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పేదల ప్లాట్లతో ఆడుకోవద్దు:ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పేదలు అప్పులు చేసి కొనుగోలు చేసిన ప్లాట్లను వ్యవసాయ భూమి కింద రిజిస్ట్రేషన్ చేసి వారి జీవితాలతో ఆడుకోవద్దని మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద సిరికల్చర్‌కాలనికి చెందిన చేనేత కార్మికులు 70 మంది వచ్చి వారి గోడు వెళ్లబోసుకున్నారు. టీకేపల్లె సర్వేనెంబర్ 423/2లో ఇరవై ఏళ్ల క్రితం తాము 77 ప్లాట్లు కొనుగోలు చేశామని అందులో 15 మంది హౌసింగ్ లోన్లు తీసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. కాని గత నెల ఈ సర్వేనెంబర్‌లోని 1.85 ఎకరాల భూమిని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ కొనుగోలు చేయగా, సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి వ్యవసాయ భూమి కింద రిజిస్ట్రేషన్ చేసేశారన్నారు. మూడు రోజులుగా ఈ స్థలం చుట్టూ సిమెంటు పలకలతో కంచె ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్‌ను పిలిపించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల స్థలాలుగా ఉన్న భూమి, ఈసీ వివరాలు పాత రిజిస్ట్రేషన్‌లు చూడకుండా వ్యవసాయ భూమిగా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. ఈ భూమిని తదుపరి రిజిస్ట్రేషన్‌లు జరగకుండా హోల్డ్‌లో పెట్టాలని సూచించారు. గతంలో ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న వారు, మున్సిపాలిటీ ప్లాన్ అప్రూవల్ ఉంటే ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. సీటీఎం వద్ద కూడా ఓ భూమి రిజిస్ట్రేషన్‌లో సబ్ రిజిస్ట్రార్ అధికారులు తప్పుగా చేశారని, ఇక మీదట అలా జరిగితే ఉపేక్షించమని సబ్‌రిజిస్ట్రార్‌ను ఎమ్మెల్యే మందలించారు.

ముతకనవారిపల్లిలో టీడీపీ కుటుంబాలకు తాగునీరిస్తాం


ముతకనవారిపల్లిలో గ్రామస్థులతో మాట్లాడున్న ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ ముతకనవారిపల్లిలో ఉన్న టీడీపీ కుటుంబాలకు తాగునీరిస్తామని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' లో టీడీపీ కుటుంబాలకు ఐదేళ్లగా తాగునీరు నిలిపివేత అనే వార్తకు స్పందించిన ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, అధికారులతో కలిసి ముతకనవారిపల్లిలో పర్యటించి గ్రామంలో నెల కొన్న పరిస్థితులపై విచారించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతి బోరు గ్రామంలో అందరికి చెందినదని కొంత మంది మాత్రమే నీరు పట్టుకొని మిగిలిన వారికి ఇవ్వకుండా తాళం వేయడం చట్టరీత్యా నేరమన్నారు. బోరు వద్ద నుంచిపైపు లైను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో తాగునీరు అందించాలని కార్యదర్శిని అదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ


అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలను వితరణ చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు సెక్టార్‌లోని కమ్మచెరువు అంగన్‌వాడీ కేంద్రానికి క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ సంస్థ వారు కేంద్రాంలోని చిన్నారుల కోసం కుర్చీలు వితరణగా అందజేశారు. సంస్థ ప్రతినిధులైన డీఎం జగదీష్, మేనేజర్ నాగరాజు, అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ,ల చేతుల మీదుగా 20 చిన్న కుర్చీలు, పెద్ద కుర్చీలు 4, జంపకానాలు, అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులను వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి సూచించారు. శనివారం ఆయన మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెలో జరుగుతున్న గృహనిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహాలు నిధుల లేమితో నిలిచి పోయిన విషయం తెలిసిందే దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిలిచి పోయిన గృహాలకు సైతం బిల్లులు మంజూరు చేస్తున్నదని, తిరిగి లబ్ధిదారులు పనులను ప్రారంభిస్తే బిల్లులు వేగవంతంగా మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగార్జున, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కలకడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):సామాజిక తనిఖీ బహిరంగ సభ సోమవారం ఉదయం 10 గంటలకు కలకడ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరుగనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్‌రహీం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.